తెలంగాణ శాసనసభ

దినపత్రికలో
అన్ని రకాల ప్రకటనలు
అడ్వర్టైజ్మెంట్స్ మరియు
వార్తల కోసం

సంప్రదించండి: 9100900931

TELANGANA SHASANA SABHA

TELTEL/2016/68867

# తెలంగాణ శాసనసభ

తెలుగు దినపత్రిక

Published from Hyderabad,Rangareddy,Nalgonda,Mahabubnagar, Khammam,

తెలంగాణ | సంపుటి : 02 | సంచిక : 170 | ఎడిటర్ : పోలగోని రాజేష్ | సోమవారం 25 నవంబర్ - 2024 | పేజీలు : 8 | వెల : 04/-



## ప్రజాపాలనను ప్రతిబింబించేలా

# 9 రోజుల వేడుకలు

- రాష్ట్రంలో కొత్త ఇంటిగ్రేటేడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ భవనాలకు భూమిపూజ నిర్వహిస్తారు
- ఒకటో తేదీ నుంచి 7వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో సీఎం కప్ పోటీలు
- కొత్తగా 213 అంబులెన్స్ వాహనాలు

మిగతా »»3లో

**శాసనసభ / హైదరాబాద్ :** ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా తొమ్మిది రోజుల పాటు జరిగే వేడుకల ఏర్పాట్లలో రాష్ట్ర ప్రభుత్వం నిమగ్నమైంది. డిసెంబర్ ఒకటో తేదీ నుంచి 9వ తేదీ వరకు జరిగే ఈ వేడుకల్లో అభివృద్ధితో పాటు ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు ప్రాధాన్యమివ్వాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఇప్పటికే అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.ఈ మేరకు శాఖలవారీగా ఒకటో తేదీ నుంచి వరుసగా నిర్వహించే కార్యక్రమాల ప్రణాళికను అధికారులు సిద్ధం చేస్తున్నారు. ఇందులో భాగంగా రాష్ట్రంలో కొత్త ఇంటిగ్రేటేడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ భవనాలకు భూమిపూజ నిర్వహిస్తారు. ఇప్పటికే 28 నియోజకవర్గాల్లో ఈ భవనాల పనులు మొదలయ్యాయి. మరో 26 నియోజకవర్గాల పరిధిలో ఇంటిగ్రేటేడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను ప్రభుత్వం ఇటీవలే మంజూరు చేసింది. ప్రజా పాలన విజయోత్సవాల్లో వీటికి శంకుస్థాపన చేస్తారు. ఒకటో తేదీ నుంచి 7వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో సీఎం కప్ పోటీలు నిర్వహిస్తారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడా ప్రతిభను వెలుగులోకి తేవడమే లక్ష్యంగా స్పోర్ట్స్అథారిటీ గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఈ పోటీలను నిర్వహిస్తుంది.వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో 16 కొత్త నర్సింగ్ కాలేజీలతో పాటు 28 పారా మెడికల్ కాలేజీలను నెలకొల్పుతారు. వీటితో పాటు కొత్తగా 213 అంబులెన్స్ వాహనాలు అందుబాటులోకి తీసుకు వస్తారు. మరోవైపు ట్రాన్స్జెండర్లకు వైద్య సేవలు అందించేందుకు జిల్లాకో ట్రాన్స్జెండర్ క్లినిక్కు ఏర్పాటు చేయనుంది.హైదరాబాద్ సిటీలో ట్రాఫిక్ సేవలను నియంత్రించేందుకు ట్రాన్స్జెండర్ల సేవలను వినియోగించుకుంటామ ని, ఆసక్తి ఉన్న వారికి శిక్షణను ఇచ్చి ట్రాఫిక్ వలంటీర్లుగా నియమిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే ప్రకటించారు.విజయోత్సవాల్లో భాగంగా ట్రాన్స్జెండర్లను ట్రాఫిక్ వలంటీర్లుగా నియమిస్తారు. హైదరాబాద్ నగరంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలను విజయోత్సవాల్లో చేపడుతారు.

## లగచర్లలో ప్రజలు తిరగబడడంతో ఫార్మా సిటీ కాదని,

# ఇండస్ట్రియల్ కారిడార్ అని మాట మార్చారు



- లగచర్లలో ఏర్పాటయ్యేది ఇండస్ట్రియల్ కారిడార్ అన్న హరీశ్ రావు
- కాంగ్రెస్ దొంగ హామీలను మహారాష్ట్ర ప్రజలు నమ్మలేదు
- కాంగ్రెస్ ఏడో గ్యారంటీ ఇక్కడ ఖూనీ అయిందని వ్యాఖ్యలు

**శాసనసభ / హైదరాబాద్ :** కొడంగల్ నియోజకవర్గంలోని లగచర్లలో ఏర్పాటయ్యేది ఫార్మా సిటీ కాదని, ఇండస్ట్రియల్ కారిడార్ అని సీఎం రేవంత్ రెడ్డి నిన్న వెల్లడించిన సంగతి తెలిసిందే. దీనిపై బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు స్పందించారు.లగచర్లలో ప్రజలు,రైతులు తిరగబడడంతో ఇప్పుడు ఇండస్ట్రియల్ కారిడార్ అని మాట మార్చారని విమర్శించారు. కాంగ్రెస్ ఏడో గ్యారంటీ ప్రజాస్వామ్యం ఇక్కడ ఖూనీ అయిందని పేర్కొన్నారు.

మిగతా »»3లో

## ఈ నెల 29న విశాఖలో

# ప్రధాని మోదీ పర్యటన

- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్న మోదీ
- విశాఖలో రోడ్ షో, బహిరంగ సభ
- ఏర్పాట్లను సమీక్షించిన జిల్లా కలెక్టర్ ప్రసాద్



**ఢిల్లీ / శాసనసభ :** ప్రధాని నరేంద్ర మోదీ ఏపీకి వస్తున్నారు. ఈ నెల 29న ఆయన విశాఖలో పర్యటించనున్నారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. ఈ సందర్భంగా విశాఖ నగరంలో ప్రధాని మోదీ రోడ్ షో, బహిరంగ సభకు హాజరుకానున్నారు. ప్రధాని వస్తుండడంతో, ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ ప్రసాద్ సమీక్ష నిర్వహించారు. సాయంత్రం 4.30 గంటలకు ఆంధ్రా వర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీ గ్రౌండ్ లో మోదీ సభ ఏర్పాటు చేశారు. ఎన్టీపీసీ గ్రీన్ హైడ్రోజన్ హబ్, ఇతర ప్రాజెక్టులకు ఈ సభ నుంచి మోదీ శంకుస్థాపన చేయనున్నారు.

## అధికారం పోయిందని బీఆర్ఎస్ నాయకులు

# ప్రతిరోజు కాంగ్రెస్‌పై ఏడుస్తున్నారు



**శాసనసభ / హైదరాబాద్ :** పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం పత్తిపాక శివారులో పత్తిపాక రిజర్వాయర్ స్థలాన్ని పరిశీలించారు మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వం వచ్చి ఏడాది గడవనే లేదు అంతలోనే అల్లావుద్దీన్ అద్భుతదీపంలా పనిచేయాలని ప్రజల్లో నూరి పోస్తున్నారు బీఆర్ఎస్ పార్టీ నాయకులు అని ఆయన అన్నారు.

మిగతా »»3లో

## మా ఇంటిపై ఆరోపణల్లో

# నిజం లేదు:


## హైడ్రా కమిషనర్ రంగనాథ్



**శాసనసభ / హైదరాబాద్ :** తమ ఇల్లు విషయంలో వస్తున్న వార్తలపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పందించారు. హైదరాబాద్ మధురానగర్‌లో తన ఇల్లు బఫర్ జోన్‌లో ఉందంటూ వస్తున్న వార్తల్లో వాస్తవం లేదన్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడారు. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే తనపై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.'సోషల్ మీడియాల్లో వస్తున్న వార్తల్లో వాస్తవం లేదు.

## వనవాసి,నగరవాసి,గ్రామవాసి..

# ఎవరైనా భారతీయులే



**ఢిల్లీ / శాసనసభ :** మన నాగరికత వనవాసి, నగరవాసి, గ్రామ వాసి ఇలా ఉండేదని కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. జగద్గురు ఆదిశంకరాచార్యులు నాలుగు పీఠాలు స్థాపించారని..తన బాల్యంలో కంచి మఠం పరమాచార్య చంద్రశేఖరాచార్య సరస్వతి బోధనలు విన్నానని గుర్తు చేసుకున్నారు. హైదరాబాద్ శిల్పకళావేదికలో నాలుగు రోజుల పాటు జరిగిన లోక్ మంథన్ ముగింపు వేడుకలకు ఆరెస్సెస్ చీఫ్ మోహన్‌భాగవత్, కేంద్రమంత్రులు నిర్మలా సీతారామన్, గజేంద్రసింగ్ షెకావత్, కిషన్ రెడ్డి పాల్గొన్నారు.

మిగతా »»3లో

## ఈనెల 29 తెలంగాణ

# ప్రజలు మరిచి పోలేని రోజు..



- తెలంగాణ రాకముందు ఉన్న పరిస్థితులు మళ్లీ ఏర్పడ్డాయన్నారు
- ప్రతి జిల్లాలో సీనియర్ నాయకులు పాల్గొంటారన్నారు
- ఆరోజు తెలంగాణ కోసం దీక్ష చేస్తే...
- ఇప్పుడు కాంగ్రెస్ అరాచకాలపై మరోసారి దీక్షలు చేయాలని అనుకుంటున్నామన్నారు

మిగతా »»3లో

# ప్రభుత్వాలు శాశ్వతం కాదు..

## పోలీసులకు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ హితవు



**శాసనసభ / హైదరాబాద్ :** సీఎం రేవంత్ రెడ్డి సొంతూరు కొండారెడ్డిపల్లి మాజీ సర్పంచ్ పాంకుంట్ల సాయిరెడ్డి ఆత్మహత్య చేసుకోవడం చాలా బాధాకరమని బీఆర్ఎస్ నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. నాగర్‌కర్నూలు జిల్లా కల్వకుర్తి ప్రభుత్వ దవాఖాన మార్చురీలో ఉన్న సాయిరెడ్డి భౌతిక కాయానికి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ నివాళులర్పించారు.సాయిరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మీడియాతో మాట్లాడుతూ..

మిగతా »»3లో

## ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిద్దాం..

# స్థానిక పోరులో సత్తా చాటుదాం..

## బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



**శాసనసభ / హైదరాబాద్ :** భారత దేశ చరిత్రలోనే అధికారంలోకి వచ్చిన పది నెలల్లోనే ఇంత ప్రజా వ్యతిరేకత మూట గట్టుకున్న ప్రభుత్వం ఎక్కడా లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు.ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేయకుండా పార్టీ మారిన వ్యక్తులను ప్రజలు క్షమించరని స్పష్టం చేశారు.

మిగతా »»3లో

## ఎన్టీఆర్‌తోనే తెలుగుజాతికి గుర్తింపు



**శాసనసభ / హైదరాబాద్ :** ప్రపంచానికి తెలుగుజాతి కీర్తిని చాటిచెప్పిన మహనీయుడు ఎన్టీఆర్ అని, ఆయన ద్వారానే తెలుగుజాతికి గుర్తింపు వచ్చిందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఎన్టీఆర్ స్ఫూర్తితోనే రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతోందని చెప్పారు. ఖమ్మం జిల్లా కేంద్రంలో వెలుగుమట్ల అర్బన్ పార్కుకు రూ.2 కోట్లతో చేపట్టిన రహదారికి ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం కమ్మ మహాజన సంఘం వనసమారాధనలో పాల్గొని మాట్లాడారు. కమ్మకులస్తులది స్వతహాగా వ్యవసాయం వృత్తి అయినా ప్రపంచీకరణ నేపథ్యంలో అన్నివృత్తుల్లో రాణించి ప్రతిభావంతులుగా నిలుస్తున్నారన్నారు. దేశ, విదేశాల్లో డాక్టర్లు, ఇంజనీర్లుగానే కాకుండా ఐటీ సంస్థలకు సీఈవోలుగా రాణిస్తుండడం తెలుగుజాతి అదృష్టమన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఎయిర్‌పోర్టు ఏర్పాటే తన లక్ష్యమని, ఇందుకోసం తనవంతు కృషిచేస్తాని తుమ్మల తెలిపారు

## అందులో తెలంగాణా సీఎం రేవంత్ రెడ్డికి పీహెచ్. డీ!



**శాసనసభ / హైదరాబాద్ :** జులై 19 చర్ల లో ఫార్మా సిటి అంటూ ప్రభుత్వం గెజిట్ ఇచ్చి ఇప్పుడు లగచర్లలో ఫార్మా సిటీ కాదు ఇండస్ట్రియల్ కారిడార్ అంటూ సీఎం మాట మార్చడం పైన ఆయన టార్గెట్ చేశారు. ఇప్పుడు నువ్వు ఇచ్చిన గెజిట్ పైనే అబద్ధాలు ఆడుతున్నావని రేవంత్ రెడ్డిని విమర్శించారు.ప్రజలకు క్షమాపణ చెప్పి గెజిట్ వెనక్కి తీసుకున్నట్టు రేవంత్ రెడ్డి ప్రకటించాలని, ఆ జీవో రద్దు చేసి కొత్త గెజిట్ ఇస్తేనే ప్రజలు నమ్ముతారని మాజీ మంత్రి హరీష్ రావు పేర్కొన్నారు. పచ్చని పంటలు పండే భూములను తొండలు గుడ్డు పెట్టని భూములు గా రేవంత్ రెడ్డి ప్రచారం చేస్తున్నాడని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. హుజురాబాద్ లో దళిత సోదరులపైన అక్రమ కేసులను పెట్టి ఇబ్బందులు పెడుతున్నారన్నారు. హుజరాబాద్లో 18,500 మందికి కేసిఆర్ దళిత బందు మంజూరు చేస్తే వీరిలో కొందరికి ఆగిపోయిన ఐదు లక్షల డబ్బులు ఇవ్వమంటే పోలీసులతో దాడి చేసి, లాఠీచార్జి చేయించారని హరీష్ రావు మండిపడ్డారు. ఉపముఖ్యమంత్రి దళితులకు చేసే మేలు ఇదేనా అంటూ నిలదీశారు. వెంటనే దళిత బంధు డబ్బులు ఇవ్వాలన్నారు. దళిత బంధు అకౌంట్ ల ఫ్రీజింగ్ ఎత్తివేసి వారికి డబ్బులను విడుదల చేయాలని హరీష్ రావు డిమాండ్ చేశారు.డిసెంబర్ 9 నుంచి జరిగే అసెంబ్లీలో దళితుల పక్షాన ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామన్నారు. తెలంగాణ రాష్ట్రం లో కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు వెంటనే అమలు చేసి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఇచ్చిన విధం గా పెన్షనర్ లకు పాత బకాయిలతో సహా పెన్షన్లు చెల్లించాలని హరీష్ రావు అన్నారు. నూట ఒక్క దేవుళ్ళ పై ప్రమాణం చేసి తెలంగాణా ప్రజలను మోసం చేశారన్నారు.మహారాష్ట్ర లో తెలంగాణ మంత్రులు ప్రచారం చేసిన స్థానాల్లో మహారాష్ట్ర ప్రజలు ఓడగొట్టారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ మీద అబద్ధాలు ఆడిన ముఖ్యమంత్రి ఇప్పుడు హైదారాబాద్ కు మూసి నదికి నీళ్లు తీసుకెళ్లడానికి టెండర్లు ఎలా పిలుస్తున్నారని ప్రశ్నించారు. రైతులను మోసం చేసి మహబూబాబాద్ లో ఎలా సంబరాలు చేసుకుంటారని హేళన చేశారు.

## గ్యారెంటీ వార్.. కాంగ్రెస్ టార్గెట్‌గా బీజేపీ, బీఆర్ఎస్ విమర్శలు.. కిషన్ రెడ్డి, హరీష్ రావు ఏమన్నారంటే..



**శాసనసభ / హైదరాబాద్ :** కాంగ్రెస్ గ్యారంటీ హామీలపై విపక్షాల విమర్శలు పీక్స్‌కి వెళ్తున్నాయి. మహారాష్ట్ర ఎన్నికల ఫలితాల తరువాత గ్యారంటీల అమలే లక్ష్యంగా బీజేపీ, బీఆర్ఎస్ రాజకీయ దాడి తీవ్రం చేయడం ఆసక్తికరంగా మారింది.మహారాష్ట్ర ఎన్నికల్లో కాంగ్రెస్ సారథ్యంలోని మహా వికాస్ అఘాడీ కూటమి దారుణ ఓటమి మూటగట్టుకుంది. ఈ పరాజయం కారణంగా తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ విపక్షాలకు టార్గెట్‌గా మారింది. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన గ్యారంటీ హామీలను ఇటు బీజేపీ, అటు బీఆర్ఎస్ ప్రస్తావిస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ గ్యారంటీ హామీల మోసాలను మహారాష్ట్ర ప్రజలు నమ్మలేదని ఆరోపిస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలను మహారాష్ట్ర ప్రజలు విశ్వసించలేదన్నారు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి. దేశంలో కాంగ్రెస్‌కు మూడు రాష్ట్రాలే మిగిలాయని.. ఆ మూడు రాష్ట్రాల్లోనూ కాంగ్రెస్ మోసపూరిత గ్యారంటీ హామీలతో అధికారంలోకి వచ్చిందని విమర్శించారు.గ్యారంటీల పేరుతో తెలంగాణ ప్రజలను మోసం చేసిన సీఎం రేవంత్.. మహారాష్ట్రలోనూ అదే చేయాలని అనుకున్నారని మాజీమంత్రి హరీష్‌రావు ఆరోపించారు. అయితే మహారాష్ట్ర ప్రజలు కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పారన్నారు. తెలంగాణలో తమ ఘనత వల్లే రికార్డ్ స్థాయిలో వరి పండిందని కాంగ్రెస్ నేతలు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు హరీష్‌రావు. ఇది నిజంగా కాంగ్రెస్ ఘనతే అయితే.. గతంలో ఇంతలా వరి ఎందుకు పండలేదని ప్రశ్నించారు.దేశవ్యాప్తంగా చాలా రాష్ట్రాల్లో గ్యారంటీ పేరుతో హామీలు ఇచ్చిన కాంగ్రెస్ నాయకత్వం.. కొన్ని రాష్ట్రాల్లో అధికారం దక్కించుకోగా.. మరికొన్ని రాష్ట్రాల్లో ఓటమి పాలైంది. అయితే మహారాష్ట్ర ఎన్నికల సందర్భంగా బీజేపీ గ్యారంటీలను ఎక్కువగా టార్గెట్ చేసింది. ఇక తెలంగాణలో గ్యారంటీ హామీలను పూర్తిస్థాయిలో ఎప్పుడు అమలు చేస్తారంటూ బీజేపీ, బీఆర్ఎస్ నిత్యం హస్తం పార్టీని విమర్శిస్తున్నాయి. మహారాష్ట్ర ఎన్నికల ఫలితాల కాంగ్రెస్ పార్టీ మరింతగా గ్యారంటీలపై విమర్శలు ఎదుర్కోవాల్సి వస్తోందని..దాడి దీనికి సంకేతమనే చర్చ జరుగుతోంది.

## ధర్మబద్ధమైన విజ్ఞానం కావాలి



**శాసనసభ / హైదరాబాద్ :** సమాజానికి ధర్మబద్ధమైన విజ్ఞానం ఆవశ్యకత ఎంతైనా ఉందని ఆరెస్సెస్ సర్‌సంఘచాలక్ మోహన్ భాగవత్ అన్నారు. భారతదేశంలో ధర్మం విజ్ఞానభరితమైందని, మరి విజ్ఞానం ధర్మసమ్మతమా, కాదా అని ఆలోచించాలని సూచించారు. ఆదివారం శిల్పకళా వేదికలో 'లోక్‌మంథన్ భాగ్యనగర్ 2024' ముగింపు కార్యక్రమంలో భాగవత్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోకం, సృష్టి, ధర్మం సనాతనమని, ఇవి కలిసే నడుస్తాయని, ప్రళయం వరకు ఉంటాయన్నారు. ఇవి కలిసి ఉంటేనే అస్తిత్వం కొనసాగుతుందన్నారు. ఏకత్వ భావన వుంటే అంతా మనదేనన్న భావన వస్తుందని చెప్పారు. మనం ధర్మం పేరుతో చాలా అధర్మాలు చేశామని, స్వార్థం పెరిగిపోయిందని,అందుకే దుర్బలులుగా మారిపోయామన్నారు. మనం సమాజాన్ని మనం సరిచేసే ప్రక్రియ కొనసాగకపోవడం వల్లే సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని తెలిపారు.శాస్త్రవేత్తలు ఇప్పటి వరకు కణాలు, జడత్వమని మాట్లాడారని, ఇప్పుడు చైతన్యమని అంటున్నారని భాగవత్ పేర్కొన్నారు. కానీ చైతన్యం అన్న అనుభూతి భారతీయుల వద్ద ఎప్పటి నుంచో ఉందని చెప్పారు. దీన్ని మరిచిపోయామని, ఈ విస్మృతి నుంచి బయటపడాలని సూచించారు. అడవుల్లో ఉండే వనవాసీలు వాటికి ధర్మకర్తలని, వాటిని సంరక్షిస్తారని, ధర్మంగా వ్యవహరిస్తారని కొనియాడారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ మనదేశంలో వనవాసీల పట్ల పురాతనకాలం నుంచీ వివక్ష లేదన్నారు. తమిళనాడులో కొన్ని సుబ్రహ్మణ్యస్వామి క్షేత్రాల్లో వనవాసీలు భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తారని చెప్పారు. వనవాసీ, గ్రామవాసీ, నగరవాసీ అని అంటున్నా, మన మనసుల్లో మాత్రం భారతీయులమే అన్న భావన ఎప్పటి నుంచో ఉందన్నారు. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి, లోక్‌మంథన్ ఆహ్వాన సంఘం చైర్మన్ కిషన్‌రెడ్డి మాట్లాడుతూ దేశాన్ని విశ్వగురుగా నిలిపేందుకు కలిసికట్టుగా ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందని చెప్పారు. దేశంలో ఆధ్యాత్మికత పెంపొందడంతో పాటు అభివృద్ధిని కొన్ని శక్తులు సహించలేకపోతున్నాయన్నారు. అరాచకం సృష్టించే ప్రయత్నం చేస్తున్నాయని ఆరోపించారు. వికసిత్ భారత్ లక్ష్యంగా ప్రధాని మోదీ చేస్తున్న కృషికి అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ మాట్లాడుతూ దేశంలో కుటుంబ వ్యవస్థ కుప్పకూలుతున్న తరుణంలో లోక్‌మంథన్ వంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. 'ధర్మంగా, తాత్వికంగా మనం గెలిచామ'ని మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలపై భాగవత్ పరోక్ష వ్యాఖ్యలు చేశారు. నిన్న, మొన్న ఎన్నికలు జరిగాయి కదా అని ఆయన చమత్కరిస్తూ ఓటమిని జీర్ణించుకోలేనివారు విమర్శలు చేస్తున్నారని అన్నారు. దేవుడి గురించి తెలిసిన వారు, తెలియని వారు కొంతమంది ఏళ్ల తరబడి పోరాటాలు చేసి అలసిపోయారని వ్యాఖ్యానించారు. 'బయటి నుంచి ప్రశ్నించేవారికి సమాధానం ఇచ్చే ఆట మనకు వద్దు. అలాంటి వారికి మనమెందుకు జవాబివ్వాలి? వారి మైదానానికి వెళ్లి వారి నియమాలకు అనుగుణంగా మనమెందుకు కబడ్డీ ఆడాలి? మన మైదానంలోకి ప్రపంచాన్ని తీసుకురావాలి. ఇదీ మన లక్ష్యం' అని భాగవత్ అన్నారు.

## జనవరి 10 వరకు ధాన్యం కొనుగోళ్లు



**శాసనసభ / హైదరాబాద్ :** వచ్చే ఏడాది జనవరి 10వ తేదీ వరకు రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు అందుబాటులో ఉంటాయని, రైతులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు.చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేస్తామని భరోసా ఇచ్చారు. కాళేశ్వరం పథకం నుంచి చుక్క నీరు రాకపోయినా.. రాష్ట్రంలో రికార్డు స్థాయిలో ధాన్యం పండిందని తెలిపారు. 66 లక్షల ఎకరాల్లో వరి సాగైందని, 153 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి జరిగిందన్నారు. దేశంలోనే ఇది అరుదైన రికార్డని చెప్పారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంత్రి ఆదివారం ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం పలు జిల్లాల అధికారులతో టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ధాన్యం తూకం వేసిన మూడ్రోజుల్లోనే డబ్బులు రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నామని మంత్రి ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు 3.50 లక్షల మంది రైతుల నుంచి రూ.5,040 కోట్ల విలువైన 21.73 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, ఇందులో 16.06 లక్షల టన్నులు దొడ్డు ధాన్యమని, 5.67 లక్షల టన్నులు సన్న ధాన్యమని వెల్లడించారు. సన్నాల రైతులకు క్వింటాలుకు రూ.500 ప్రోత్సాహం కింద రూ.283.25 కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. రాష్ట్రంలో మొత్తం 7,990 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని తెలిపారు. నిరుడు ఈ సమయానికి రైతులకు రూ.2,414 కోట్లు చెల్లిస్తే.. ఈసారి రూ.2,760 కోట్లు చెల్లించామన్నారు. **ఇబ్బంది పెడితే సహించం!** హుజూర్‌నగర్ మండలం వేపలసింగారం లోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఉత్తమ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడి రైతులు తమ సమస్యలను మంత్రికి వివరించారు. దీంతో మంత్రి.. కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌తో ఫోన్‌లో మాట్లాడి పలు ఆదేశాలు జారీ చేశారు. రైతులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇబ్బంది పెట్టవద్దని, ఎన్ని టోకెన్లు కావాలన్నా వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. కొన్న ధాన్యాన్ని తక్షణం లారీలు, ట్రాక్టర్లలో మిల్లులకు తరలించాలని ఆదేశించారు. కొనుగోళ్లలో రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సాగర్ ఆయకట్టు పరిధిలో పంటలు ఎలా పండాయని మంత్రి ఆరా తీయగా.. పంట దిగుబడులు అధికంగా వచ్చాయని రైతులు తెలిపారు.

## లగచర్ల దాడి ఘటనలో ఊహించని షాకింగ్ పరిణామం!




**శాసనసభ / హైదరాబాద్ :** వికారాబాద్ జిల్లా లగచర్లలో భూసేకరణ నిమిత్తం వెళ్లిన కలెక్టర్ తో పాటు అధికారులపైన రైతులు దాడి చేసిన ఘటన ఆ తర్వాత చోటు చేసుకున్న అరెస్టుల నేపథ్యంలో తాజాగా కీలక పరిణామాలు చోటుచేసుకు న్నాయి.ఈ ఘటనలో పలువురు రైతులను పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రస్తుతం వారంతా సంగారెడ్డి జైల్లో రిమాండ్ ఖైదీలు ఉన్నారు.జైల్లో రైతులను కలిసిన నేషనల్ హ్యూమన్ రైట్స్ కమీషన్ బృందం ఇక తాజాగా వీరిని నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ బృందం కలిసింది ఎనిమిది మంది సభ్యులతో కూడిన ఈ బృందం సంగారెడ్డి జైలుకు వెళ్లి రైతులను కలిసి మాట్లాడింది. నిన్న ఢిల్లీ నుంచి హైదరాబాద్ కు చేరుకున్న ఎనిమిది మంది సభ్యులతో కూడిన నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ సంగారెడ్డి జైలులో నిందితుడు సురేష్ తో సహా 19మందిని కలిసి లగచర్లలో అసలేం జరిగింది అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు.రైతుల అరెస్టు సమయంలో మానవ హక్కుల ఉల్లంఘన జరిగిందని పలువురు నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ ను ఆశ్రయించారు. అమాయకులను కుట్రపూరితంగా అరెస్టు చేశారని హ్యూమన్ రైట్స్ కమిషన్ కు ఫిర్యాదు చేశారు. పోలీసులు గిరిజనుల పట్ల, ఆడవారి పట్ల అసభ్యంగా ప్రవర్తించారని, అర్ధరాత్రి ఇంట్లోకి చొరబడి తమ వారిని అరెస్టు చేశారని పలువురు బాధితులు జాతీయ మానవ హక్కుల కమిషన్కు ఫిర్యాదు చేశారు.తాజాగా 8 మంది సభ్యుల బృందం ఈ ఘటనపై విచారణకు రంగంలోకి దిగింది. ఇందులో భాగంగా సంగారెడ్డి జైలుకు వెళ్లి జైలులో రిమాండ్ ఖైదీలుగా ఉన్న వారిని కలిసి వారి నుండి వివరాలను సేకరించింది. ఇది ఇలా ఉంటే లగచర్లలో ఫార్మా విలేజ్ ఏర్పాటును రైతులు అక్కడ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.ఈ క్రమంలోనే ఈనెల 11వ తేదీన అక్కడ భూసేకరణకు సంబంధించి అభిప్రాయ సేకరణ కోసం వెళ్లిన వికారాబాద్ కలెక్టర్ తో పాటు ఇతర అధికారులపైన రైతులు దాడికి పాల్పడ్డారు. ఆ తర్వాత వీడియో ఫుటేజ్ ఆధారంగా దాడికి పాల్పడిన వారిని గుర్తించిన పోలీసులు పలువురిని అరెస్ట్ చేసి జైలుకు పంపారు.ఇక ఈ దాడి ఘటన పైన కుట్రపూరితంగానే అధికారులపై దాడులకు పాల్పడ్డారని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు.ఈ ఘటనలో ప్రతిపక్షాల కుట్ర ఉందని పేర్కొన్న ఆయన అధికారులపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. దీని వెనుక బీఆర్ఎస్ హస్తం ఉందని బీఆర్ఎస్ పార్టీకి చెందిన కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి పాత్ర ఉందని కాంగ్రెస్ పార్టీ మంత్రులు నేతలు టార్గెట్ చేశారు .ఈ క్రమంలో ఈ కేసులో నిందితుడిగా పట్నం నరేందర్ రెడ్డి ని అరెస్ట్ చేసి జైలుకు తరలించారు ప్రస్తుత ఆయన చర్లపల్లి జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు.

## ఇందిరమ్మ కమిటీలకు హైకోర్టు గ్రీన్‌సిగ్నల్



**శాసనసభ / హైదరాబాద్ :** గూడు లేని నిరుపేదల కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకానికి లబ్ధిదారుల ఎంపిక కోసం నియమించిన ఇందిరమ్మ కమిటీలకు హైకోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. విధాన నిర్ణయం ప్రకారం ప్రయోజనకరమైన పథకాలను అమలు చేయడానికి ప్రభుత్వానికి విచక్షణాధికారం ఉంటుందని చెప్పింది. అలాంటి అంశాల్లో న్యాయస్థానాలు జోక్యం చేసుకోలేవని స్పష్టం చేసింది. ఇందిరమ్మ కమిటీలను సవాల్ చేస్తూ బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేందర్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసింది.అయితే, ఏ ఉద్దేశం మేరకు పథకం ప్రారంభించారో.. దానికి విరుద్ధంగా అమలు జరిగితే కోర్టును ఆశ్రయించవచ్చని పిటిషనర్‌కు స్వేచ్ఛనిచ్చింది. ఇందిరమ్మ ఇంటి పథకం కింద తొలిదశలో 4,50,000 గృహాలను నిర్మించాలని, లబ్ధిదారులకు రూ.5 లక్షల ఆర్థిక సాయం అందజేయాలని సంకల్పించింది. ఈ నేపథ్యంలో గ్రామ పంచాయతీ, మున్సిపల్ వార్డు స్థాయిలో ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటుచేస్తూ గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి 2024, అక్టోబర్ 11న జీవో 33 జారీచేశారు. స్థానికులతో ఈ కమిటీలను కలెక్టర్ ఎంపిక చేస్తారు.పంచాయతీల్లో సర్పంచ్ లేదా ప్రత్యేక అధికారి కమిటీ చైర్మన్‌గా ఇద్దరు స్వయం సహాయక సంఘాల మహిళలు, మరో ముగ్గురు (ఒక బీసీ, ఒక ఎస్సీ లేదా ఎస్టీ తప్పనిసరి) సభ్యులుగా ఉంటారు. మున్సిపల్ వార్డుల్లో కౌన్సిలర్ లేదా కార్పొరేటర్ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. ఈ జీవోను సవాల్ చేస్తూ ఏలేటితోపాటు మరొకరు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై జస్టిస్ నగేశ్ భీమపాక విచారణ చేపట్టి తీర్పు ఇటీవల వెలువరించారు.పారదర్శకంగానే అమలు: ఏఏజీ పిటిషనర్ల తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. 'ఎలాంటి అర్హతలు పేర్కొనకుండా సభ్యుల ఎంపిక చట్టవిరుద్ధం. ఇష్టం వచ్చిన వారిని, పార్టీలకు చెందిన కార్యకర్తలను సభ్యులుగా నియమించే ప్రమాదం ఉంటుంది. గ్రామ సభలు, వార్డు కమిటీల ప్రస్తావన లేకుండా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేయడం సరికాదు. ఈ కమిటీలను రద్దు చేయాలి'అని కోరారు.ప్రభుత్వం తరఫున ఏఏజీ తేరా రజనీకాంత్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. 'రాష్ట్రంలో ఇళ్లు లేని వారి కోసం ఇందిరమ్మ పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కమిటీలున్నా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్లు పర్యవేక్షణ చేస్తారు. ఆవాస్ ప్లస్ 2024 యాప్‌లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించాకే ఎంపిక జరుగుతుంది. అక్రమాలకు తావులేకుండా పారదర్శకంగా పథకం అమలు ప్రక్రియ సాగుతోంది. ఈ పిటిషన్లను కొట్టివేయాలి'అని చెప్పారు.గ్రామసభ అనుమతి తప్పనిసరి కాదు..'పంచాయతీ రాజ్ చట్టంలోని సెక్షన్ 6(8) ప్రకారం లబ్దిదారుల ఎంపికకు గ్రామసభ అనుమతి తప్పనిసరి కాదు. ఈ కేసులో పంచాయతీలో కార్యదర్శి, మున్సిపల్ వార్డులో వార్డుస్థాయి అధికారి ప్రజాపాలన కింద వచ్చిన దరఖాస్తులపై సర్వే నిర్వహిస్తారు. యాప్‌లో కుటుంబంతోపాటు ఆదాయ వివరాలను నమోదు చేస్తారు. అర్హత ప్రమాణాల ప్రకారం లబ్దిదారులను నిర్ధారిస్తారు.పథకాలను అమలు చేయడానికి ప్రభుత్వానికి స్వేచ్ఛ, విచక్షణ ఉంటుంది. యాప్, కమిటీలు, ఉన్నతాధికారుల పర్యవేక్షణ.. ఇలా పథకాన్ని పారదర్శకంగా అమలు చేసేందుకు నిర్ణయించినట్లు తెలుస్తోంది. నచ్చిన వారిని కమిటీలు ఎంపిక చేసుకుంటాయని, పిటిషనర్లు భయపడటం అర్థంలేనిది'అని న్యాయమూర్తి తీర్పులో పేర్కొన్నారు.

## త్వరలోనే సీఎం పాపం పండుతుంది



**శాసనసభ / హైదరాబాద్ :** తొందరలోనే ఆయన పాపం పండుతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యానించారు. లగచర్ల ఘటనకు సంబంధించి నమోదైన కేసులో అరెస్టయిన మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని మాజీ మంత్రులు మహమూద్ అలీ, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, రాగిడి లక్ష్మారెడ్డితో కలిసి కేటీఆర్ శనివారం చర్లపల్లి జైల్లో ములాఖత్ అయ్యారు.నరేందర్‌రెడ్డిని పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం జైలు ఆవరణలో కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి కక్షపూరితంగా చేయని తప్పునకు శిక్ష అనుభవిస్తున్న నరేందర్‌రెడ్డి ధైర్యంగా ఉన్నారన్నారు. తనలాగే చేయని తప్పునకు ప్రభుత్వం జైల్లో పెట్టిన 30 మంది పేద, గిరిజన, దళిత రైతులకు అండగా ఉండాలని, వారి కుటుంబాలకు ధైర్యం చెప్పాలని నరేందర్‌రెడ్డి కోరారని కేటీఆర్ తెలిపారు. రైతన్నలకు అండగా కేసీఆర్ ఉన్నారని.. న్యాయం, ధర్మం ఎప్పటికైనా గెలుస్తాయన్నారు.ముఖ్యమంత్రి సొంతూరులో ఆయన సోదరులు కొండారెడ్డిపల్లి మాజీ సర్పంచ్ సాయిరెడ్డి ఇంటికి తోవ లేకుండా గోడ కట్టడంతో క్షోభతో ఆత్మహత్య చేసుకున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. అధికారం ఉందని సాయిరెడ్డి ఆత్మహత్య చేసుకొనేలా ఒత్తిడి తెచ్చిన సీఎం సోదరుడు నుముల గురువారెడ్డి చేస్తున్న అరాచకాన్ని ప్రజలు గమనించాలన్నారు. రేవంత్‌రెడ్డికి రాజకీయ భవిష్యత్తు లేకుండా గుణపాఠం చెప్పాల్సిన బాధ్యత అందరిపై ఉందని కేటీఆర్ పేర్కొన్నారు.

## కొత్త బస్సులు సమకూర్చుకోండి



**శాసనసభ / హైదరాబాద్:** మహాలక్ష్మి పథకం అమలుతో పెరిగిన ఆర్టీసీ ప్రయాణికుల రద్దీకి తగ్గట్లుగా సేవలను అందించడానికి కొత్త బస్సులను సమకూర్చుకోవాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు.ఆర్టీసీ సీఎండీ సజ్జనార్, రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి వికాస్‌రాజ్ తదితరులతో మంత్రి పొన్నం శనివారం తన కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. గతేడాది డిసెంబర్ నుంచి ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో 1,389 కొత్త బస్సులను ఆర్టీసీ కొనుగోలు చేసిందన్నారు.మొదటి విడతలో మహబూబ్‌నగర్, కరీంనగర్, ఖమ్మం, వరంగల్ ఉమ్మడి జిల్లాల్లోని మహి ళా స్వయం సహాయక సంఘాల మండల సమాఖ్యలకు అద్దె బస్సులను అందజేయాలని రాష్ట్ర ప్రభు త్వం నిర్ణయించిందన్నారు. ఈ నాలుగు ఉమ్మడి జిల్లాల్లో ఒక్కటి చొప్పున అద్దె బస్సులను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇటీవల ప్రారంభించిన కార్గో హెూం డెలివరీ సదుపాయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు.

## నాలుగు వేల పెన్షన్ అమలు ముహూర్తం ఖరారు..!!



శాసనసభ / హైదరాబాద్ : తెలంగాణలో రేవంత్ సర్కార్ కొలువు తీరి ఏడాది పూర్తవుతోంది. ఈ సమయంలో ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. అధికారంలోకి రావటానికి దోహదం చేసిన గ్యారంటీల అమల్లో భాగం గా రేవంత్ సర్కార్ ఇప్పటికే కొన్ని ప్రారంభించింది.ఇక, రూ 4వేల పెన్షన్ అమలు దిశగా ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. ఇప్పటికే లబ్దిదారుల సంఖ్య, ఖర్చు అంచనా పైన ఒక స్పష్టతకు వచ్చింది. దీంతో, త్వరలోనే ఈ పథకం అమలు పైన ప్రకటనకు సిద్దమవుతోంది.ప్రభుత్వం కసరత్తు ముఖ్యమంత్రి రేవంత్ తొలి ఏడాది పాలన పూర్తి చేసుకుంటున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు దిశగా కసరత్తు చేస్తున్నారు. అందులో భాగంగా ఇప్పటికే ఉచిత బస్సు, గ్యాస్ సిలిండర్ల పథకాలు అమలు చేస్తున్నారు. రైతు రుణమాఫీ దాదాపుగా పూర్తి చేసారు. ఇంకా రుణమాఫీ చేయాల్సిన వారికి త్వరలోనే పూర్తి చేస్తామని ప్రభుత్వం చెబుతోంది. ఇదే సమయంలో ఎన్నికల సమయంలో పెన్షన్ రూ 4వేల కు పెంచి అమలు చేస్తామని నాడు కాంగ్రెస్ నేతలు హామీ ఇచ్చారు. ఈ హామీ అమలు దిశగా ప్రస్తుతం కసరత్తు జరుగుతోంది. త్వరలో పంచాయితీ ఎన్నికలకు వెళ్లాలని ప్రభుత్వం భావిస్తోంది.పెన్షన్ల పెంపు ఈ ఎన్నికలకు ముందే పెండింగ్ హామీలను అమలు చేయాలని ఆలోచన చేస్తోంది. ఏడాది పాలన పూర్తవుతున్న వేళ ఆసరా పెన్షన్ రూ 4 వేలకు పెంపుతో పాటుగా రైతు భరోసా పైన ప్రణాళికలు సిద్దం చేస్తున్నట్లు తెలుస్తోంది. రైతు భరోసా గురించి ప్రతిపక్షాల నుంచి విమర్శలు మొదల య్యాయి. ఆసరా పెన్షన్ పెంపు, రైతు భరోసా అమలు కాకపోవటం పైన ప్రజల్లో కొంత అసంతృప్తి ఉన్నట్లు పార్టీలో చర్చ సాగుతోంది. దీంతో, ఈ రెండు అమలు చేయటం ద్వారా పూర్తి సానుకూలత వస్తుందని అంచనా వేస్తున్నారు. ప్రభుత్వం ప్రస్తుతం నిర్వహిస్తున్న సర్వేలోనూ పలువురు వీటి కోసం ప్రశ్నిస్తున్నట్లు గుర్తించారు. ఈ రెండు అమలు చేయకుండా స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్తే నష్టం తప్పదని భావిస్తున్నారు.అసెంబ్లీ సమావేశాల్లో దీంతో, ప్రస్తుతం రూ. 2 వేలు ఉన్న పెన్షన్‌ను రూ. 4వేలకు, దివ్యాంగులకు రూ. 4 వేలుగా ఉన్న పెన్షన్‌ను రూ. 6 వేలకు పెంచేలా ఆర్థిక శాఖ ప్రతిపాదనలు సిద్ధం చేస్తోంది. వచ్చే నెల 9వ తేదీ నుంచి అసెంబ్లీ శీతాకాల సమావేశాలు ప్రారంభం కానున్నాయి. రైతు భరోసా పైన అసెంబ్లీలో చర్చించిన తరువాతనే అమలు పైన ప్రకటన చేయాలని ప్రభుత్వం భావిస్తుంద ని సమాచారం. రైతు భరోసా పరిమితి ఖరారు పైన ఒక నిర్ణయం తీసుకున్న తరువాత అమలు గురించి ప్రభుత్వం ప్రకటన చేయనుంది. సభలో ప్రతిపక్షాల నుంచి సూచనలు, సలహాలు స్వీక రించాలనేది రేవంత్ ఆలోచనగా సమాచారం. దీంతో, వచ్చే నెలలో అసెంబ్లీ సమావేశాల్లో ఈ అంశం పైన చర్చించిన తరువాత ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

## ప్రజాపాలనను ప్రతిబింబించేలా 9 రోజుల వేడుకలు

గోషామహల్లో నిర్మించనున్న ఉస్మానియా ఆసుపత్రి కొత్త భవనానికి భూమిపూజ చేస్తారు.ఆరంఘర్ జూపార్క్ ఫ్లై ఓవర్ను ప్రారంభిస్తారు. ఇటీవల నిర్మాణం పూర్తయిన ఆరు ఎస్టీపీలను ప్రారంభిస్తారు. హెచ్సిటీ ప్రాజెక్టులో భాగంగా చేపట్టే వివిధ పనులకు భూమిపూజ చేస్తారు. వీటితో పాటు కేబీఆర్ పార్కు సమీపంలో ఫ్లై ఓవర్లు, అండర్ పాస్లతో ఆరు జంక్షన్లను అభివృద్ధి చేసే రూ.826 కోట్ల భారీ ప్రాజెక్టుకు శ్రీకారం చుడుతారు. హైదరాబాద్లో శిల్పకళా వేదిక సమీపంలో దాదాపు 106 స్టాళ్లతో ఇందిరా శక్తి మహిళా బజార్ను ప్రారంభిస్తారు. తెలంగాణ ఫారెస్ట్ డెవెలప్ మెంట్ కార్పొరేషన్ భవనానికి పునాది రాయి వేస్తారు. వీటితో పాటు అటవీ పర్యాటక శాఖల అధ్వర్యంలో సఫారీ థీమ్ పార్క్, బొటానికల్ గార్డెన్లను ప్రారంభిస్తారు.ఘట్కేసర్లో బాలికలకు ప్రభుత్వ ఐటీఐ, అడ్వాన్సుడ్ టెక్నాలజీ సెంటర్ను ఏర్పాటు చేస్తారు. ఇప్పటికే పనులు జరుగుతున్న మల్లేపల్లి, మేడ్చల్, నల్గొండ ఏటీసీలను ప్రారంభిస్తారు. దామరచర్లలో యాదాద్రిలో థర్మల్ పవర్ ప్లాంట్లో 800 మెగావాట్ల ఒక యూనిట్ను జాతికి అంకితం చేస్తారు. దీంటో పాటు రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో 237 సబ్‌స్టేషన్లను ఏర్పాటు చేస్తారు. ఇప్పటికే ప్రారంభించిన యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ తరగతులను ప్రారంభిస్తారు. కొత్తగా ప్రభుత్వం తలపెట్టిన స్పోర్ట్ యూనివర్సిటీకి భూమిపూజ చేస్తారు. ఐటీ, ఇండస్ట్రీస్ శాఖ అధ్వర్యంలో ఏఐ సిటీ ఏర్పాట్లతో పాటు పలు ఒప్పందాలు చేసుకుంటారు. విజయోత్సవాల సందర్భంగా రాష్ట్రంలోని అన్ని పాఠశాలలు, కాలేజీల్లో వ్యాసరచన పోటీలు నిర్వహిస్తారు. అన్ని స్థాయిల్లోని విద్యార్థులు ఈ వేడుకలు జరుపుకునేలా విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోంది. శాఖల వారీగా నిర్ణీత ప్రణాళిక ప్రకారం సంబంధిత మంత్రుల సారధ్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఆయా జిల్లాల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు మంత్రులతో పాటు ఈ కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలని పిలుపునిచ్చారు.

## ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిద్దాం.. స్థానిక పోరులో సత్తా చాటుదాం..

ఆదివారం బంజారాహిల్స్ లోని తన నివాసంలో జగిత్యాల నియోజకవర్గ నాయకులతో ఆమె సమావేశమయ్యారు. సోమవారం ఉదయం 11 గంటలకు కులగణన కమిషన్‌కు నివేదిక అందజేయనున్నారు. ఈ నేపథ్యంలో, బీసీ సంఘాల నాయకులతోనూ ఎమ్మెల్సీ కవిత సమావేశమయ్యారు.**జగిత్యాలతో ఆత్మీయ అనుబంధం** జగిత్యాలకు, నాకు ఆత్మయ అనుబంధం ఉందని ఎమ్మెల్సీ కవిత చెప్పారు. 2014 లో నిజామాబాద్ ఎంపీగా తాను గెలిచినా, జగిత్యాల ఎమ్మెల్యేగా సంజయ్ కుమార్ ఓడిపోయారని, కానీ పార్టీలకతీతంగా, వచ్చిన తెలంగాణను అభివృద్ధి చేసుకువాలని, కాంగ్రెస్ ఎమ్మెల్యే ఉన్నా, అభివృద్ధిలో జగిత్యాల వెనకబడొద్దనే ఆదేశాలను కేసీఆర్ ఇచ్చారని ఎమ్మెల్సీ కవిత గుర్తుచేశారు.తెలంగాణ ఏర్పడగానే చిన్న జిల్లాలు ఏర్పాటు చేసుకోవాలి. చిన్న జిల్లాల ద్వారానే ఎక్కువ అభివృద్ధి జరుగుతుంది, గ్రామాల్లో ఉన్న ప్రతి పేద వ్యక్తికి కూడా తెలంగాణ సాధించిన ఫలితం అందుతుందని కేసీఆర్ తెలంగాణ ఉద్యమం రోజుల్లోనే చెప్పేవారు. తెలంగాణ ఏర్పడిన తరువాత కేసీఆర్, జగిత్యాల జిల్లాను ఏర్పాటు చేయడంతో పాటు, హైదరాబాద్ తరువాత ఎక్కువ సంఖ్యలో, 4,500 డబుల్ బెడ్ రూం ఇండ్లు జగిత్యాలకే కేటాయించి ప్రత్యేక శ్రద్ధ చూపెట్టారు. అని ఎమ్మెల్సీ కవిత తెలిపారు.**నాయకులు పార్టీ మారినా.. పార్టీతోనే కార్యకర్తలు** ప్రస్తుతం పార్టీ మారిన ఎమ్మెల్యే సంజయ్, అప్పుడు ఎమ్మెల్యే కాకపోయినా, పార్టీ ప్రతి కార్యక్రమంలో వేదిక పైకి తీసుకొచ్చి, కాబోయే ఎమ్మెల్యే అంటూ ఐదేండ్ల పాటు ప్రతి గ్రామంలో చెప్పామని ఎమ్మెల్సీ కవిత తెలిపారు. ఓడిపోయినా వదిలేయకుండా గౌరవంగా చూసుకుంటామనే సందేశం ఇచ్చిన సభ్యత గల పార్టీ బీఆర్ఎస్ అని ఎమ్మెల్సీ కవిత అన్నారు. ఆనాడు జగిత్యాల ఎమ్మెల్యేగా ఉన్న జీవన్ రెడ్డి ఎన్ని ఆకృత్యాలు, ఆఘాయిత్యాలు చేసినా, బీఆర్ఎస్ కార్యకర్తలంతా ముందుండి కొట్లాడారు కాబట్టే, జగిత్యాలలో గులాబీ జెండా ఎగిరిందని ఎమ్మెల్సీ కవిత తెలిపారు. నాయకులు పార్టీలు మారినా, కార్యకర్తలు పార్టీలోనే ఉంటారని చెప్పడానికి మంచి ఉదాహరణ జగిత్యాల నియోజకవర్గం అని ఆమె పేర్కొన్నారు.

## కోటిదీపోత్సవంలో తొలిసారి ఆకాశలింగ క్షేత్ర వైభవం..



శాసనసభ / హైదరాబాద్ : కార్తీక మాసానికి ప్రత్యేక స్థానం ఉంది.. హిందువులు ఈ నెలలో శివుడు, విష్ణువులిద్దరి పూజ కొరకు చాలా పవిత్రంగా భావిస్తారు.. కార్తీక స్నానాలకు,ఈ మాసం వివిధ వ్రతాలకు శుభప్రధమైనదిగా పురాణాలు చెబుతున్నాయి. ఇక, కార్తీక మాసం వచ్చిందంటే చాలు హైదరాబాద్‌తో పాటు తెలుగు రాష్ట్రాలకు చెందిన భక్తుల చూపు మొత్తం ఎన్టీవీ-భక్తి టీవీ నిర్వహించే కోటిదీపోత్సవంపైనే ఉంటుంది. కార్తిక మాసం శుభవేళ.. రోజుకో కల్యాణం, వాహనసేవ, పీఠాధిపతుల ప్రవచనాలు, ప్రముఖుల ఉపన్యాసాలతో 'కోటి దీపోత్సవం' దిగ్విజయంగా కొనసాగుతోంది. కోటి దీపోత్సవం వేళ హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియం శివనామస్మరణతో 16వ రోజు మార్మోగిపోయింది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి.. దీపాల పండుగలో పాల్గొని ఈ లోకాన్నే మరిచేలా పునీతులయ్యారు.కార్తీక ఆదివారం వేళ ఈరోజు విశేష కార్యక్రమాలను నిర్వహించారు. 16వ రోజు వేడుకల్లో.. కోటిదీపాల వెలుగులు.. సప్తహారతి కాంతుల నడుమ అంగరంగ వైభవంగా జరిగింది. ఆధ్యాత్మిక గురువుల ఆశీర్వచనాలు, ప్రవచనాలు చేశారు. అంతేకాకుండా.. పంచభూతలింగ సహిత ద్వాదశ జ్యోతిర్లింగ ఆరాధన, కోటిదీపోత్సవంలో తొలిసారి ఆకాశలింగ క్షేత్ర వైభవం నిర్వహించారు. ఇలకైలాస ప్రాంగణంలో భక్తుల చెంతకు ఆదిదంపతుల విహారం చేశారు. అలాగే.. చిదంబరం శ్రీ నటరాజస్వామి, శివగామసుందరి కల్యాణం ఘనంగా జరిపించారు. చివరలో లింగోద్భవం, సప్తహారతులు, మహానీరాజనంతో 16వ రోజు కోటి దీపోత్సవం వైభవంగా ముగిసింది.

## అబద్ధాల్లో రేవంత్‌కు డాక్టరేట్



శాసనసభ / హైదరాబాద్ : అబద్ధాలు ఆడటంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పీహెచ్‌డీతో పాటు డాక్టరేట్ ఇవ్వొచ్చని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. ఆదివారం కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి నోరు తెరిస్తే అబద్ధాలు తప్ప నిజాలు రావడం లేదని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారెంటీలను వంద రోజుల్లో అమలు చేస్తామని చెప్పి, ఇప్పటివరకు ఇచ్చిన హామీల్లో ఏ ఒకటీ సంపూర్ణంగా పూర్తి చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహారాష్ట్రలో ఇటీవల జరిగిన ఎన్నికల్లో అక్కడి ప్రజలు కాంగ్రెస్‌కు గట్టిగా బుద్ధి చెప్పారని పేర్కొన్నారు. అక్కడ రేవంత్, తెలంగాణ మంత్రుల ప్రచారం వల్లే కాంగ్రెస్ ఓడిందని ఎద్దేవా చేశారు. ఆరు గ్యారెంటీల పేరుతో తెలంగాణ ప్రజలను మోసగించిన విషయాన్ని మహారాష్ట్ర ప్రజలు గుర్తించారని చెప్పారు.ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పి ఒట్టేసి దేవుళ్లను కూడా రేవంత్‌రెడ్డి మోసం చేశారని విమర్శించారు. దేవుళ్లనే మోసం చేసిన రేవంత్‌కు ప్రజలను మోసం చేయడం పెద్ద పనేమీ కాదని మండిపడ్డారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం పూర్తిగా ఖూనీ అయిపోయిందని, ఎక్కడ చూసినా అరాచకమే కనిపిస్తున్నదని ఆరోపించారు. తాము కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టుతో రాష్ట్రం సస్యశ్యామలమైందని, అది చూసి ఓర్వలేని కాంగ్రెస్ పార్టీ కాళేశ్వరం కూలిపోయిందని అపవాదు వేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాళేశ్వరం కూలిపోతే హైదరాబాద్ ప్రజల దాహార్తి తీర్చేందుకు అవసరమయ్యే 20 టీఎంసీలను కాళేశ్వరం నుంచి తరలించేందుకు టెండర్లు పిలవాలని సీఎం ఎలా చెప్పారని, మూసీ నదిలోనూ 5 టీఎంసీలు కలుపుతామని ఎలా అన్నారని ప్రశ్నించారు. కాళేశ్వరం కూలిందని సీఎం అంటుంటే, మంత్రులు మాత్రం గడిచిన పదేండ్లలో తెలంగాణలో అత్యధిక వ్యవసాయ ఉత్పత్తులు జరిగాయని చెప్తున్నారని పేర్కొన్నారు. ఇవన్నీ చూస్తుంటే కాళేశ్వరంపై సీఎం కావాలనే అభాండాలు వేస్తున్నారని ప్రజలకు అర్థమైందని పేర్కొన్నారు.మోసం చేసి వారోత్సవాలా?రైతులకు ఇచ్చిన 9 హామీల్లో ఏ ఒక్కదానినీ పూర్తిస్థాయిలో అమలు చేయకుండా, రైతులను అన్ని విధాలా మోసం చేసిన ప్రభుత్వం వారోత్సవాలు ఎలా నిర్వహిస్తున్నదని హరీశ్‌రావు ప్రశ్నించారు. ఫార్మా కంపెనీకి వ్యతిరేకంగా ముఖ్యమంత్రి ఇలాకాలోనే రైతులు పోరాడుతున్న విషయాన్ని హరీశ్‌రావు ఈ సందర్భంగా గుర్తు చేశారు. 19 జూలై 2024న ఫార్మాసిటీ కోసం గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చిన ముఖ్యమంత్రి ఇప్పుడు ఇండస్ట్రియల్ ఎస్టేట్ అని ఎలా చెప్తారని ప్రశ్నించారు. తాము సేకరించబోయే భూముల్లో తొండలు కూడా గుడ్లు పెట్టవని సీఎం చెప్తుంటే, రైతులు మాత్రం అక్కడ పచ్చని పంట పొలాలను చూపిస్తున్నారని పేర్కొన్నారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని వెంటనే ఫార్మా క్లస్టర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వరంగల్ డిక్లరేషన్ ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. పత్తికి మద్దతు ధర రూ. 7,500 ఉంటే రూ. 6,500 మాత్రమే ఇస్తున్నారని, వడ్లను రూ. 1600-1700కే దళారులకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. బోనస్ బోగస్ అయిందని మండిపడ్డారు.దళితబంధు నిధులు విడుదల చేయాలి దళితబంధు రెండో విడత నిధులను వెంటనే విడుదల చేసి వారిని ఆదుకోవాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హుజూరాబాద్ నియోజకవర్గంలో పైలెట్ ప్రాజెక్టుగా అమలు చేసిన దళితబంధు పథకం ద్వారా ఎంతోమంది దళితులు ఉన్నతస్థాయికి ఎదిగారని గుర్తు చేశారు. రెండో విడత దళితబంధు నిధులపై ఫ్రీజింగ్ ఎత్తివేసి వెంటనే వారి ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దళితబంధు కోసం హుజూరాబాద్‌లో ధర్నాకు దిగిన దళిత కుటుంబాలను అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు చెప్పారు. దళితబంధు నిధుల విడుదలపై మంత్రి భట్టివిక్రమార బాధ్యత తీసుకోవాలని కోరారు. సమావేశంలో మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, తెలంగాణ మెడికల్ సర్వీసెస్ ఆఫ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ తకళ్లపల్లి రాజేశ్వర్‌రావు, బీఆర్ఎస్ హుజూరాబాద్ పట్టణ అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## వనవాసి, నగరవాసి, గ్రామవాసి.. ఎవరైనా భారతీయులే: నిర్మలా సీతారామన్

ఈ సందర్భంగా నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ.. " ఇప్పటికీ రాజకీయ ప్రస్తావన వచ్చినప్పుడు, కొంతమంది బయటి నుంచి వలస వచ్చారనే చర్చ జరుగుతోంది. తమిళనాడులో కొన్ని సుబ్రహ్మణ్యం స్వామి క్షేత్రాలు ఉన్నాయి. వాటిని వనవాసీలు తమ దైవంగా పూజిస్తారు. ఆదివాసీల పట్ల వివక్ష ఉందని కొందరు అక్కడక్కడ మాట్లాడుతున్నారు. వనవాసి, నగరవాసి, గ్రామవాసి ఎవరైనా మన భారతీయులే" అన్నారు."వస్తు రూపేణా సంతోషం కోరుకున్నా.. అది ఎక్కువ రోజులు ఉండదు. ఋషుల ఆలోచనలో ఇది సనాతన దేశం. మన పూర్వీకుల్లో సంస్కారం ఉండేది. అందుకే వ్యవహారం ఉండేది. దేశంపైకి విదేశీయులు ఆక్రమణకు వచ్చి మన సంస్కృతిని చిన్నాభిన్నం చేశారు. ఆధ్యాత్మిక బాటలో ఉంటే ధర్మం నిలుస్తుంది. సృష్టి నియమానుసారంగా మన పూర్వీకులు నడిచేవారు. ఇప్పుడది లేదు.. ధర్మం కంటే అధర్మమే ఎక్కువైంది. మనుషుల్లో స్వార్థం పెరిగింది. ఇక ధర్మం ఎక్కడ ఉంటుంది? విజ్ఞానం ముందు ధర్మం ఉండదా? విజ్ఞానం ఉపయోగించేవాడి తీరు బట్టి ధర్మం నిలుస్తుంది. ధర్మం గురించి అందరం ఆలోచించాలి. దానికోసం మన విజ్ఞాన గ్రంథాలను అధ్యయనం చేయాలి. మనం వేరే గ్రౌండ్‌లోకి వెళ్లొద్దు. అవతలివాళ్లనే మన గ్రౌండ్‌లోకి పిలవాలి" అన్నారు.భారతదేశ చరిత్ర చూస్తే వేల సంవత్సరాల ఇతిహాసం, సంస్కృతి, ప్రపంచంలోనే ఆధ్యాత్మిక కేంద్రంగా ఉందని కేంద్రమంత్రి గజేంద్రసింగ్ షెకావత్ అన్నారు. మన విజ్ఞానాన్నంతటినీ ధ్వంసం చేశారన్నారు. ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొని దేశం నిలబడిందని.. సనాతన ధర్మాన్ని కాపాడేందుకు ఇలాంటి లోక్ మంథన్ కార్యక్రమాలు మరిన్ని జరగాల్సిన అవసరం ఉందన్నారు. "ఎన్ని విధ్వంసాలు జరిగినా భారత ధర్మం, సంస్కృతిని మరిచిపోలేదు. లోక కల్యాణం నుంచి విశ్వ కల్యాణం వరకు మన సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవడమే మన ధర్మం. భారతదేశం సంస్కృతి, విభిన్న జాతులు, విభిన్న శైలి సంస్కృతులతో కూడిన దేశం. మన ఋషులు అమూల్యమైన సంపదను అందించారు. చెట్లకు పూజలు చేయడం వెనుక ఒక శాస్త్రీయ కోణం ఉండేది. గతంలో జరిగిన విధ్వంసం నుంచి భారత్ ఇప్పుడిప్పుడే పూర్వ సంతరించుకుంటోంది" అన్నారు.

( మొదటి పేజీ తరువాయి )

## లగచర్లలో ప్రజలు తిరగబడడంతో ఇప్పుడు ఇండస్ట్రియల్ కారిడార్ అని మాట మార్చారు

లగచర్లకు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులను వెళ్లనివ్వడంలేదని ఆరోపించారు. ఫార్మాసిటీ ఏర్పాటు చేస్తున్నట్టు గతంలో గెజిట్ కూడా ఇచ్చారని, ప్రజాగ్రహం రావడంతో ఇండస్ట్రియల్ కారిడార్ అంటున్నారని దుయ్యబట్టారు. మహారాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఎన్నికల్లో బుద్ధి చెప్పారని పేర్కొన్నారు. కాంగ్రెస్ దొంగ హామీలను మహారాష్ట్ర ప్రజలు నమ్మలేదని తెలిపారు. ఇచ్చిన హామీలను కాంగ్రెస్ నెరవేర్చడంలేదని ధ్వజమెత్తారు. బాండ్ పేపర్లపై రాసిచ్చి ప్రజలను మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండో విడత దళిత బంధు డబ్బులు అడిగితే దళితులపై దాడి చేశారని మండిపడ్డారు. తెలంగాణకు కాంగ్రెస్ చేసిన మోసాన్ని ప్రజలు గమనించారని వ్యాఖ్యానించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ బుద్ధి తెచ్చుకోవాలని హరీశ్ రావు హితవు పలికారు.ఇవాళ హుజూరాబాద్ లో హరీశ్ రావు మీడియా సమావేశం ఈ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... చాలా రోజుల తర్వాత హుజూరాబాద్ జర్నలిస్టులతో మాట్లాడటం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రికి అబద్ధాలు ప్రచారం చేయడంలో డబుల్ పీహెచ్ డీ ఇవ్వొచ్చని ఎద్దేవాచేశారు. పట్టపగలు గోబెల్స్ ప్రచారం చేస్తుంటాడని అన్నారు."కర్ణాటక, తెలంగాణలో గ్యారెంటీల పేరుతో మోసం చేశారు. మహారాష్ట్రలోనూ గ్యారెంటీ పేరుతో మోసం చేయబోయారు. అక్కడకు వెళ్లి మహిళలకు మూడు వేలు, రైతులకు రుణమాఫీ చేస్తాం అన్నారు. సీఎం, మంత్రులు వెళ్లి ప్రచారం చేశారు. అని విమర్శించారు.

## అధికారం పోయిందని బీఆర్ఎస్ నాయకులు ప్రతిరోజు కాంగ్రెస్‌పై ఏడుస్తున్నారు

అధికారం పోయిందని బీఆర్ఎస్ నాయకులు ప్రతిరోజు కాంగ్రెస్ ప్రభుత్వం పై ఏడుస్తున్నారని, గత బీఆర్ఎస్ 10 సంవత్సరాల పాలనలో నిరుద్యోగులు ఉద్యోగాలు లేక అల్లాడిపోయారన్నారు. ఏడాదిలోనే నిరుద్యోగులకు వేలాది మందికి ఉద్యోగాలు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వంది అని ఆయన వ్యాఖ్యానించారు. మాది మాటల ప్రభుత్వం కాదు చేతల ప్రభుత్వమని, సంక్షేమ పథకాలు ప్రజలకు ఇవ్వద్దని బీఆర్ఎస్ నాయకులు సంకల్ప దీక్ష చేపడతారా అని ఆయన ప్రశ్నించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ప్రాజెక్టులు, రిజర్వాయర్లు నిర్మించిన ఘనత కాంగ్రెస్ పార్టీదే అని, పది నెలల్లో ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ఇచ్చామన్నారు మంత్రి శ్రీధర్ బాబు.అంతేకాకుండా..'మాకు సలహాలు ఇవ్వడానికి ప్రతిపక్ష పార్టీ టిఆర్ఎస్ పార్టీకి హృదయం ఉండాలి. బీఆర్ఎస్ పార్టీ నడిపించుకోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వం పై బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారు. తెలంగాణ ఇచ్చింది సోనియాగాంధీ. సోనియా గాంధీ ఆలోచనల్లో విద్యా వైద్యం రైతులకు సాగునీరు వంటివి ఇవ్వడమే సోనియా గాంధీ లక్ష్యం. మేము ఇచ్చిన ప్రజా వాగ్దానాలు తప్పకుండా నెరవేరుస్తాం. గతంలో హరీష్ రావు పత్తిపాకలో పల్లె నిద్ర చేసి రిజర్వాయర్ నిర్మిస్తానని చెప్పి నిర్మించలేక అబద్ధాలు చెప్పాడు. పత్తిపాక రిజర్వాయర్ నిర్మాణం అయితే ధర్మపురి పెద్దపల్లి నియోజకవర్గంలోని భూములు సస్యశ్యామలం అవుతాయి' అని మంత్రి శ్రీధర్ బాబు వ్యాఖ్యానించారు.

## ప్రభుత్వాలు శాశ్వతం కాదు.. పోలీసులకు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ హితవు

తన చావుకు సీఎం రేవంత్ రెడ్డి బ్రదర్స్ కారణమని సాయిరెడ్డి తన సూసైడ్ నోట్‌లో పేర్కొన్నారని తెలిపారు. అయినప్పటికీ పోలీసులు 108 బీఎన్ఎస్ కింద కేసులు ఎందుకు నమోదు చేయడం లేదని ప్రశ్నించారు. సీఎం బద్రర్స్ రాజ్యాంగేతర శక్తులుగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.ప్రభుత్వాలు శాశ్వతం కాదని.. రాజ్యాంగానికి లోబడి విధులు నిర్వహించాలని పోలీసులకు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ హితవు పలికారు. సాయిరెడ్డి మృతికి బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. అన్యాయానికి గురైన వారి తరఫున బీఆర్ఎస్ పార్టీ ప్రశ్నిస్తూనే ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

## మా ఇంటిపై ఆరోపణల్లో నిజం లేదు: హైడ్రా కమిషనర్ రంగనాథ్

44 ఏళ్ల క్రితం మా నాన్న నిర్మించిన ఇంట్లోనే ఉంటున్నాం. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు కొందరు దుష్ప్రచారం చేస్తున్నారు. ఒకప్పటి పెద్ద చెరువునే 25 ఏళ్ల క్రితం కృష్ణకాంత్ పార్కుగా మార్చారు. కృష్ణకాంత్ పార్క్‌కు మా ఇంటికి మధ్య వేలాది ఇల్లు ఉన్నాయి. చెరువు కట్టకు దిగువన 10 మీటర్లు దాటితే బఫర్ జోన్ పరిధిలోకి రావు. మా ఇల్లు చెరువు కట్టకు దాదాపు కిలోమీటర్ దూరం ఉంది' అని హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పష్టం చేశారు.ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు కొంతమంది చేస్తున్న ప్రయత్నాన్ని ఖండిస్తున్నానని అన్నారు. 44 ఏళ్ల క్రితం నిర్మించిన అదే ఇంట్లో తన తండ్రితో కలిసి ఉంటున్నట్లు తెలిపారు. కాగా, యూసఫ్‌గూడ కృష్ణకాంత్ పార్క్ దగ్గర హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఇల్లు బఫర్ జోన్‌లోనే ఉందని.. అది ఒకప్పటి చెరువు అని కాంగ్రెస్ బహిష్కృత నేత బక్క జడ్సన్ ఆరోపించారు.హైదరాబాద్ నగరంలో అక్రమ నిర్మాణాలు, చెరువులను ఆక్రమించిన కట్టడాలను హైడ్రా కూలుస్తున్న విషయం తెలిసిందే. అయితే, ప్రస్తుతం పేదల ఇళ్లను, ఏళ్లుగా నివాసం ఉంటున్న వారి ఇళ్లను కూల్చబోమని అన్నారు. అయితే, అనుమతులు లేకుండా నిర్మించిన అక్రమ కట్టడాలను, చెరువులను ఆక్రమించి కట్టిన వాటిని కూల్చేస్తామని స్పష్టం చేశారు.

## ఈనెల 29 తెలంగాణ ప్రజలు మరిచి పోలేని రోజు..

ఈనెల (నవంబర్) 29వ తేదీ తెలంగాణ ప్రజలు మరిచి పోలేని రోజని బీఆర్ఎస వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణ సాధనలో కేసీఆర్ చేసిన దీక్ష మైలు రాయిగా ఉందన్నారు.అందుకే నవంబర్ 29 దీక్ష దివస్ చేసుకుంటున్నామన్నారు. తెలంగాణ రాకముందు ఉన్న పరిస్థితులు మళ్లీ ఏర్పడ్డాయన్నారు. ఆరోజు తెలంగాణ కోసం దీక్ష చేస్తే... ఇప్పుడు కాంగ్రెస్ అరాచకాలపై మరోసారి దీక్షలు చేయాలని అనుకుంటున్నామన్నారు. నవంబర్ 29 నాడు 33 జిల్లాలో దీక్ష దివస్ చేయబోతున్నామన్నారు. ప్రతి జిల్లాలో సీనియర్ నాయకులు పాల్గొంటారన్నారు. డిసెంబరు 9న మేడ్చల్ లో తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణ చేస్తామన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అందరం పాల్గొంటామన్నారు. నవంబర్ 29 న నిమ్స్ ఆసుపత్రిలో కూడా కార్యక్రమాలు చేస్తామని తెలిపారు. కేసీఆర్ ఎక్కడా పాల్గొనరు.. కానీ ఆయన స్ఫూర్తి తోనే దీక్ష దివస్ చేస్తామన్నారు. 2009 నవంబర్ 29న కేసీఆర్ చేపట్టిన నిరాహారదీక్షతో మలిదశ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడి స్వరాష్ట్ర సాధనకు బలమైన పునాది పడిందన్నారు. ఈ నిరాహార దీక్ష యావత్ భారత రాజకీయ వ్యవస్థను కుదిపేసి తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు కేంద్ర ప్రభుత్వమే ప్రకటించేలా చేసిందన్నారు. దశాబ్దాల తెలంగాణ ప్రజల చిరకాల వాంఛ నెరవేరిందన్నారు. ఈ నెల 29న కరీంనగర్ లో జరిగే దీక్షా దివస్ కార్యక్రమంలో కేటీఆర్ పాల్గొననున్నారని, ప్రతి ఒక్కరు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

## రెహమాన్ మంచి వ్యక్తి.. పరువు ప్రతిష్ఠలు దెబ్బతీయెుద్దు: సైరా బాను



ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ ఆయన సతీమణి సైరా బాను సుమారు మూడు దశాబ్దాల వైవాహిక బంధానికి స్వస్తి పలుకుతు న్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే.ఈ క్రమంలోనే రెహమాన్‌ను తప్పుబడుతూ గత కొన్ని రోజులుగా వార్తలు వస్తున్నాయి. దీనిపై సైరా బాను స్పందించారు. ఆయన ఎంతో గొప్ప వ్యక్తి అని పేర్కొన్నారు."ప్రస్తుతం నేను ముంబయిలో ఉన్నా. గత కొన్ని నెలలుగా నా ఆరోగ్యం బాలేదు.ఆ కారణంతోనే ఆయనకు దూరంగా ఉండాలనుకున్నా.యూట్యూబ్,తమిళ మీడియాను ఒక్కటే కోరుకుంటున్నా. దయచేసి ఆయన గురించి ఎలాంటి చెడు ప్రచారం చేయవద్దు. ఆయన చాలా మంచి మనసు ఉన్న వ్యక్తి. ప్రపంచంలో ఉన్న గొప్ప వ్యక్తుల్లో ఆయన ఒకరు.సైరా ఎక్కడికి వెళ్లిందని అందరూ మాట్లాడుకుంటు న్నారు. ట్రీట్‌మెంట్ కోసం ముంబయి వచ్చా. ఆయన అంటే నాకెంతో ఇష్టం. ఆయనకు కూడా నేనంటే ఇష్టం. ఆయనపై విమర్శలు చేయడం ఇకనైనా మానండి. మేము ఇంకా అధికారికంగా ఏమీ ప్రకటించలేదు. కాబట్టి ఈ క్లిష్ట సమయంలో మా వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించవద్దు. త్వరలోనే నేను చెన్నై వస్తా" అని ఆమె పేర్కొన్నారు. ఆయన పరువు ప్రతిష్ఠలకు భంగం కలిగించవద్దు అని ఆమె కోరారు.29 ఏళ్ల వైవాహిక బంధానికి స్వస్తి పలుకుతూ మంగళవారం (నవంబర్ 19) రెహమాన్ ఒక పోస్ట్ పెట్టారు. పరస్పర అంగీకారంతో తాము విడిపోతున్నామని చెప్పారు. అదే రోజున ఆయన బృందంలోని మోహినిదే అనే మహిళ కూడా తన భర్త నుంచి విడాకులు తీసుకుంటున్నట్లు ప్రకటించింది. దీంతో ఎన్నో ప్రచారాలు తెరపైకి వచ్చాయి. ఈ రెండు జంటల విడాకులకు ఎలాంటి సంబంధం లేదని సైరా తరఫు న్యాయవాది ఇటీవల తెలిపారు. తన తండ్రి గురించి తప్పుడు కథనాలు చూస్తుంటే ఎంతో బాధగా ఉందని రెహమాన్ అమీన్ పోస్ట్ పెట్టాడు. మోహినిదే కూడా ఈ వార్తలపై స్పందించింది. తన విడాకులు వ్యక్తిగతమని చెప్పింది.

## సినీ నటుడు అలీకి నోటీసులు



సినీనటుడు అలీకి వికారాబాద్ జిల్లా నవాబ్‌పేట మండలం ఎక్‌మామిడి గ్రామ పంచాయతీ నోటీసులు ఇచ్చింది. అనుమతి లేకుండా ఫామ్‌హౌస్‌లో నిర్మాణాలు చేస్తున్నారని అందులో పేర్కొంది.ఈ మేరకు గ్రామ పంచాయతీ కార్యదర్శి శోభారాణి ఆయనకు నోటీసులు జారీ చేశారు. నిర్మాణాలు ఆపివేయాలని సూచించారు.ఎక్‌మామిడి రెవెన్యూ పరిధి సర్వే నెంబరు 345లోని ఫామ్‌హౌస్‌లో నిర్మాణాలకు సంబంధించి పత్రాలను సమర్పించి అనుమతులు పొందాలంటూ గతంలోనే అలీకి నోటీసులు ఇచ్చారు. ఆయన స్పందించకపోడంతో తాజాగా మళ్లీ రెండోసారి పంచాయతీ కార్యదర్శి నోటీసులు జారీ చేశారు. సంబంధించిన ధ్రువపత్రాలను సమర్పించి అనుమతులు పొందాలని సూచించారు. లేని పక్షంలో పంచాయతీరాజ్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

## 'కల్కి 2'.. 35 శాతం షూట్ చేశాం: స్వప్నదత్



ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ కాంబినేషన్‌లో తెరకెక్కిన సూపర్ హిట్ మూవీ 'కల్కి 2898 ఏడీ'దీనికి కొనసాగింపుగా 'కల్కి 2' రానున్న విషయం తెలిసిందే. ఈ సినిమా విశేషాలు తెలుసుకునేందుకు సినీ ప్రియులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. గోవాలో జరుగుతోన్న 'ఇఫ్ఫీ' వేడుకల్లో చిత్ర నిర్మాతలు స్వప్న- ప్రియాంక.. దీని షూటింగ్ గురించి స్పందించారు."పార్ట్ 2కు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. రెగ్యులర్ షూట్ ఎప్పటి నుంచి ప్రారంభించాలనే దానిపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు. అన్ని సిద్ధమయ్యాక ప్రకటిస్తాం. 'కల్కి 2898 ఏడీ'లో కీలక పాత్ర పోషించిన దీపికా పదుకొణె.. పార్ట్ 2లోనూ కొన్ని సన్నివేశాల్లో అమ్మగా కనిపించనున్నారు" అని చెప్పారు. 'కల్కి 2898 ఏడీ'తో పాటే సీక్వెల్‌కు సంబంధించిన షూట్‌ను కొంతమేర తీసినట్లు చెప్పారు. పార్ట్ 2కు సంబంధించి 35 శాతం షూట్ జరిగిందని వివరించారు. గోవా వేదికగా జరుగుతోన్న 'ఇఫ్ఫీ' వేడుకల్లో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. తెలుగు సినిమాకు ప్రపంచ వ్యాప్తంగా లభిస్తోన్న ఆదరణ చూస్తుంటే గర్వంగా ఉందని తెలిపారు.వైజయంతి మూవీస్ పతాకంపై అశ్వనీదత్ 'కల్కి 2898 ఏడీ' చిత్రాన్ని నిర్మించారు. భారీ బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ సినిమా రూ.1000 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టింది. ఆడియన్స్‌ను కొత్త ప్రపంచంలోకి తీసుకెళ్లిన ఈ చిత్రంలో అగ్ర నటులు అమితాబ్ బచ్చన్.. అశ్వత్థామగా, కమల్ హాసన్.. సుప్రీం యాస్కిన్‌గా ఆకట్టుకున్నారు. విజయ్ దేవరకొండ, దుల్కర్ సల్మాన్ అతిథి పాత్రలతో అలరించారు. బౌంటీ ఫైటర్ భైరవగా సందడి చేసిన ప్రభాస్ చివర్లో కర్ణుడిగా కనిపించి పార్ట్ 2పై మరిన్ని అంచనాలు పెంచేశారు. రెండో భాగంలో అసలైన కథ మొదలవుతుందని ఇప్పటికే మేకర్స్ ప్రకటించారు. ఇంటర్నేషన్ మార్కెట్‌లోనూ దీనిని గ్రాండ్‌గా రిలీజ్ చేసేలా సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు.

## శుభవార్త చెప్పనున్న తమన్నా?

**తమన్నా భాటియా విజయ్ వర్మ శుభవార్త చెప్పేందుకు సిద్ధం అవుతున్నట్టు తెలుస్తోంది. మీడియా నివేదికల ప్రకారం, ఇద్దరూ త్వరలో తమ సంబంధాన్ని వేరే స్థాయికి తీసుకెళ్లబోతున్నారు.ఇద్దరూ త్వరలో వివాహం చేసుకోవచ్చని అంటున్నారు. తమన్నా భాటియా మరియు విజయ్ వర్మ త్వరలో పెళ్లి చేసుకోబోతున్నట్లు తెలుస్తోంది. అందుకోసం కొత్త ఇంటి కోసం వెతుకుతున్నట్లు తెలిసింది. రాబోయే సంవత్సరంలో ఈ జంట వివాహం చేసుకోవాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. దీని కోసం ఇద్దరూ ఇప్పటికే సన్నాహాలు ప్రారంభించారు.ఈ జంట ఇంతవరకు అలాంటిదేమీ బహిరంగంగా చెప్పనప్పటికీ, తమ సంబంధాన్ని తదుపరి స్థాయికి తీసుకెళ్లడంపై ఇద్దరూ చాలా సీరియస్‌గా ఉన్నారని చెబుతున్నారు. తమన్నా మరియు విజయ్ వర్మ 2025లో పెళ్లి చేసుకోబోతున్నట్లు సమాచారం. పెళ్లి తర్వాత ఈ జంట నివసించేందుకు విలాసవంతమైన అపార్ట్‌మెంట్ కోసం ఇప్పట్టి నుంచే వెతుకుతున్నట్లు సమాచారం. వారి వైపు నుండి అధికారిక ధృవీకరణ లేనప్పటికీ, ఈ వార్త అభిమానులతో పాటు పరిశ్రమలో హాట్ టాపిక్ అవుతోంది. ఐతే వీరిద్దరి నుంచి అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు. 2023 సంవత్సరంలో లస్ట్ స్టోరీస్ 2 విడుదల సమయంలో ఈ జంట తమ సంబంధాన్ని ధృవీకరించారు.**

## శోభితతో జీవితాన్ని పంచుకునేందుకు ఎదురుచూస్తున్నా: నాగచైతన్య






తనకు కాబోయే సతీమణి, నటి శోభితా ధూళిపాళ్ల ను ఉద్దేశించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు నటుడు నాగచైతన్య తన జీవితంలో ఏర్పడిన వెలితిని ఆమె పూర్తి చేస్తుందన్నారు. ఆమెతో జీవితంలో కొత్త అధ్యాయాన్ని ఆరంభించేందుకు ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నానని తెలిపారు."మా పెళ్లి చాలా సింపుల్, సంప్రదాయబద్ధంగా జరగనుంది. ఈవేడుకల్లో ఆర్భాటాలకు తావులేదు. ఉత్సాహంగా పనులు జరుగుతున్నాయి. గెస్ట్ లిస్ట్, పెళ్లికి సంబంధించిన ఇతర విషయాలను ఇద్దరం కలిసి నిర్ణయిస్తున్నాం. హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోస్ మా కుటుంబానికి ఎంతో ప్రత్యేకం. స్టూడియోలోని తాతగారి విగ్రహం ఎదురుగా మా పెళ్లి జరగనుంది. ఆయన ఆశీస్సులు మాపై ఎప్పుడూ ఉండాలనే ఉద్దేశంతో ఇరు కుటుంబాలు ఈ నిర్ణయాన్ని తీసుకున్నాయి.ఆమెతో కొత్త జీవితాన్ని ప్రారంభించేందుకు ఆశగా ఎదురుచూస్తున్నా. తనతో నేనెంతగానో కనెక్ట్ అయ్యా. తను నన్ను బాగా అర్థం చేసుకుంది. నా జీవితంలో ఏర్పడిన శూన్యాన్ని తను పూడుస్తుందని నమ్ముతున్నా" అని ఓ ఆంగ్ల వెబ్‌సైట్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన తెలిపారు.నాగచైతన్య - శోభితా ధూళిపాళ్ల వివాహం డిసెంబర్ 4న హైదరాబాద్‌లో జరగనుంది. ఇరు కుటుంబాల పెద్దలు, ఆత్మీయుల సమక్షంలో ఈ వేడుక జరగనుందని టాక్. ఈ పెళ్లి గురించి ఇటీవల నాగార్జున స్పందించారు. "కుటుంబసభ్యులు, సన్నిహితులు, సినీ ప్రముఖులు మొత్తం 300 మందిని పిలవాలని అనుకుంటున్నాం. స్టూడియోలో అందమైన సెట్‌లో వీళ్ల పెళ్లి జరగనుంది. అలాగే పెళ్లి పనులు కూడా వాళ్లిద్దరే చేసుకుంటామన్నారు" అని అన్నారు. రిసెప్షన్ వివరాలను త్వరలో తెలుపుతామని అన్నారు. చై-శోభిత ఎంతోకాలం నుంచి స్నేహితులుగా ఉన్నారు. ఈ క్రమంలో ఇరు కుటుంబాల పెద్దల అంగీకారంతో ఆగస్టు 8న వీరి నిశ్చితార్థం జరిగిన విషయం తెలిసిందే. నాగచైతన్య ప్రస్తుతం 'తండేల్' కోసం వర్క్ చేస్తున్నారు. చందు మొండేటి దర్శకుడు. సాయిపల్లవి కథానాయిక. ప్రస్తుతం ఇది చిత్రీకరణ దశలో ఉంది.

## రెండు యుగాల్లో సల్మాన్



'జవాన్' చిత్రంతో బాలీవుడ్‌లో అడుగుపెట్టి బాక్సాఫీసు వద్ద తన మార్క్‌ను క్రియేట్ చేసుకున్న దర్శకుడు అట్లీ. ప్రస్తుతం ఆయన, బాలీవుడ్ కథానాయకుడు సల్మాన్ ఖాన్‌తో ఓ సినిమా తెరకెక్కించనున్న సంగతి తెలిసిందే.దీనికి ఏ6 (వర్కింగ్ టైటిల్). ఈ సినిమా రెండు యుగాల పునర్జన్మ కథా నేపథ్యంలో రూపొందనున్నట్లు సమాచారం. ఇందులో సల్మాన్ మునుపెన్నడూ చూడని యోధుడి పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది. ప్రతిష్ఠాత్మకమైన ఈ ప్రాజెక్టు కోసం యాక్షన్, డ్రామా, థ్రిల్ నేపథ్యంలో మరో కొత్త ప్రపంచాన్ని సృష్టించనున్నారు అట్లీ.ఇది ఇద్దరు హీరోల కథగా తెరకెక్కనుంది. ఇందులో అగ్ర కథానాయకులు కమల్ హాసన్ లేదా రజనీకాంత్ ఓ కీలక పాత్రలో నటించనున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రంలో నటించే మిగతా తారాగణాన్ని త్వరలో అధికారికంగా ప్రకటించనుంది చిత్రబృందం. స్క్రిప్ట్ పనులు పూర్తి చేసుకుంటోన్న ఈ చిత్రం వచ్చే ఏడాది సెట్స్‌పైకి వెళ్లనుంది. ప్రస్తుతం 'సికందర్', 'బేబి జాన్' చిత్రీకరణలో బిజీగా ఉన్నారు సల్మాన్.



## ఆరంభంలోనే ఆసీస్ మూడు వికెట్లు డౌన్.. పెర్త్ టెస్టుపై పట్టు బిగించిన భారత్



బోర్డర్-గావస్కర్ ట్రోఫీలో భాగంగా పెర్త్ వేదికగా జరుగుతున్న తొలి టెస్టులో ఆస్ట్రేలియాకు టీమ్‌ఇండియా 534 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది.ఓవర్‌నైట్ స్కోరు 172/0తో మూడో రోజు ఆటను కొనసాగించిన భారత్.. రెండో ఇన్నింగ్స్‌ను 487/6 స్కోరు వద్ద డిక్లేర్డ్ చేసింది. యశస్వి జైస్వాల్ (161) దంచికొట్టగా.. విరాట్ కోహ్లీ (100బీ 143 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్స్‌లు) సెంచరీతో ఆకట్టుకున్నాడు. కేఎల్ రాహుల్ (77) పరుగులు చేశాడు. నితీశ్ రెడ్డి (38బీ 27 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) ఆకట్టుకున్నాడు. ఆసీస్ బౌలర్లలో నాథన్ లైయన్ రెండు, స్టార్క్, హేజిల్‌వుడ్, కమిన్స్, మిచెల్ మార్ష్ తలో వికెట్ పడగొట్టారు. కోహ్లీ 16 నెలల తర్వాత టెస్టుల్లో శతకం బాదడం విశేషం. ఆస్ట్రేలియాలో కోహ్లీకి ఏడో శతకం. కంగారుల గడ్డపై అత్యధిక సెంచరీలు చేసిన భారత ఆటగాడిగా విరాట్ రికార్డు సృష్టించాడు. ఇప్పటివరకు ఈ రికార్డు సచిన్ తెందూల్కర్ (6 సెంచరీలు) పేరిట ఉండేది. ఈ సెంచరీతో సచిన్ రికార్డును కోహ్లీ బ్రేక్ చేశాడు.సెకండ్ ఇన్నింగ్స్ ఆరంభించిన ఆసీస్‌కు భారత పేసర్లు ఆరంభంలోనే వరుస షాక్‌లు ఇచ్చారు. తొలి ఓవర్‌లోనే మెక్‌స్వీనీ (0)ని బుమ్రా వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. నైట్ వాచ్‌మెన్‌గా వచ్చిన పాట్ కమిన్స్ (2) సిరాజ్ బౌలింగ్‌లో స్లిప్‌లో కోహ్లీకి చిక్కాడు. మార్నస్ లబుషేన్ (3)ని బుమ్రా ఎల్బీడబ్ల్యూగా వెనక్కి పంపాడు. దీంతో ఆసీస్ 12/3తో పీకల్లోతు కష్టాల్లో పడటంతో, భారత్ మ్యాచ్‌పై పూర్తి పట్టు సాధించింది. నాలుగో రోజు ఆరంభంలోనే మరిన్ని వికెట్లు తీస్తే రెండు సెషన్లలోపే మ్యాచ్ ముగిసే అవకాశముంది.

## పెర్త్‌కు చేరుకున్న రోహిత్ శర్మ.. వార్మప్ మ్యాచ్‌లో ఆడే అవకాశం!



భారత కెప్టెన్ రోహిత్ శర్మ ఆస్ట్రేలియాలో అడుగు పెట్టాడు. అతని భార్య రితికా మగబిడ్డకు జన్మనిచ్చిన సంగతి తెలిసిందే.దీంతో పెర్త్ వేదికగా జరుగుతున్న తొలి టెస్టుకు అందుబాటులో లేడు. రోహిత్ స్థానంలో జస్‌ప్రీత్ బుమ్రా సారథిగా వ్యవహరిస్తున్నాడు. తొలి టెస్టు మూడో రోజు ఆట జరుగుతున్న సమయంలోనే రోహిత్ పెర్త్‌కు చేరుకోవడం గమనార్హం. దీంతో రెండో టెస్టులో అతడు ఆటడం ఖాయమని తెలుస్తోంది.డిసెంబర్ 6 నుంచి 10 వరకు అడిలైడ్ వేదికగా ఆ మ్యాచ్ జరగనుంది. అంతకుముందే ప్రైమ్ మినిస్టర్స్ %శ×% జట్టుతో కాన్‌బెర్రా వేదికగా వార్మప్ మ్యాచ్‌లో భారత్ ఆడనుంది. నవంబర్ 30 నుంచి డిసెంబర్ 1 వరకు రెండు రోజుల వార్మప్ మ్యాచ్‌లో రోహిత్ ఆడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. దీంతో ఆసీస్ పిచ్‌లపై అవగాహన తెచ్చుకొనేందుకు వీలుంటుంది.

## పంత్‌తో చర్చించాం: పాంటింగ్ కీలక వ్యాఖ్యలు



ప్రస్తుతం ఐపీఎల్ వేలంలో అందరి దృష్టిని ఆకర్షిస్తున్న ఆటగాడు రిషభ్ పంత్. అతడు దిల్లీ జట్టును వీడాక ఏ ఫ్రాంఛైజీకి ఆడతాడనే విషయం చర్చనీయాంశంగా మారింది.దీనిపై పంజాబ్ కోచ్ రికీ పాంటింగ్ స్పందించాడు. ఓ క్రీడా ఛానల్‌తో మాట్లాడుతూ తమ ఫ్రాంచైజీ దృష్టిని ఆకర్షించిన ఆటగాళ్లలో పంత్ ఒకడని పేర్కొన్నాడు."ఈ సారి వేలం అంశాన్ని గమనించండి. మేము చాలా మంది ఆటగాళ్ల పేర్లను పరిశీలిస్తున్నాం. రిషభ్ కచ్చితంగా చాలా జట్లకు లక్ష్యంగా మారోచ్చు. కచ్చితంగా వారి వద్ద పెద్ద పర్సే ఉండి ఉంటుంది. మేము తక్కువ మంది ఆటగాళ్లను రిటైన్ చేసుకొన్నాం. మా వద్ద భారీగా నిధులున్నాయి. మరో ముగ్గురు లేదా నలుగురు ఆటగాళ్లను కొంటే మా పర్స్ ఇతర జట్లతో సమానమవుతుంది. ఇదేమీ పెద్ద ఆధిక్యం కాదు. చాలా డబ్బును మాత్రమే ఉంచుకొన్నాం. వేలానికి వెళ్లే సమయానికి ముగ్గురు లేదా నలుగురు టాప్ ఆటగాళ్లను ఎంచుకోవాలి. మేము రిషభ్ పంత్‌తో మాట్లాడాం. చాల మంది ఆటగాళ్లతో చర్చలు జరిపాం. ఇప్పుడు మా వ్యూహానికి కట్టుబడి ఉండాలనుకుంటున్నాం" అని పాంటింగ్ వివరించాడు.డబ్బు కోసం తాను దిల్లీని వీడటంలేదని పంత్ వెల్లడించాడు. ఇటీవల ఫామ్‌లో ఉన్న అతడి కోసం గట్టి పోటీ ఉంటుందనడంలో సందేహం లేదు. తిరిగి దిల్లీకి వెళ్లడానికి పంత్ సుముఖంగా లేకపోవడంతో అతడి కోసం ఆ ఫ్రాంఛైజీ ఆర్‌టీఎం కార్డును ప్రయోగించే అవకాశం లేదు. పంత్‌కు భారీ ధర పలకడం ఖాయం. ఎంత అన్నదే ప్రశ్న. రూ.25 కోట్లు అందుకోనున్న భారత తొలి ఆటగాడిగా అతడు నిలుస్తాడనే అంచనాలున్నాయి. పంజాబ్ కింగ్స్,మధ్యే ప్రధానంగా పోటీ ఉండొచ్చు.

## టీ బ్రేక్.. యశస్వి జైస్వాల్ భారీ శతకం.. భారత్ లీడ్ 400o రన్స్



ఆస్ట్రేలియాపై పెర్త్ టెస్టులో భారత్ భారీ ఆధిక్యం సాధించింది. టీ బ్రేక్ సమయానికి.. రెండో ఇన్నింగ్స్‌లో టీమ్‌ఇండియా ఐదు వికెట్ల నష్టానికి 359 పరుగులు చేసింది.క్రీజ్‌లో విరాట్ కోహ్లీ (40బి), వాషింగ్టన్ సుందర్ (13బి) ఉన్నారు. దీంతో భారత్ ఆధిక్యం 405 పరుగులకు చేరింది. యశస్వి జైస్వాల్ (161: 297 బంతుల్లో 15 ఫోర్లు, 3 సిక్స్‌లు) భారీ శతకం సాధించాడు. రిషభ్ పంత్ (1), ధ్రువ్ జురెల్ (1) విఫలమయ్యారు. ఆసీస్ బౌలర్లు మిచెల్ స్టార్క్, జోష్ హేజిల్‌వుడ్, పాట్ కమిన్స్, మిచెల్ మార్ష్, నాథన్ లైయన్ ఒక్కో వికెట్ తీశారు.ఒక్కసారిగా కుదుపు లంచ్ బ్రేక్‌కు 275/1 స్కోరుతో వెళ్లి వచ్చిన భారత్‌కు.. రెండో సెషన్ తొలి బంతికే షాక్ తగిలింది. హేజిల్‌వుడ్ వేసిన బంతిని అంచనా వేయడంలో విఫలమైన దేవదత్ పడిక్కల్ (25) స్లిప్‌లో స్మిత్‌కు క్యాచ్ ఇచ్చాడు. అనంతరం క్రీజ్‌లోకి వచ్చిన విరాట్‌తో కలిసి యశస్వి ఇన్నింగ్స్‌ను నడిపించేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో 150o మార్క్‌ను దాటేశాడు. మూడో వికెట్‌కు వారిద్దరూ 38 పరుగులు జోడించారు. మిచెల్ మార్ష్ వేసిన బంతిని ఆఫ్‌సైడ్ షాట్ కొట్టిన యశస్వి.. బ్యాక్‌వర్డ్ పాయింట్‌లో స్మిత్ అద్భుతంగా క్యాచ్‌ను అందుకొన్నాడు. ఆసీస్‌పై ఆడిన తొలి టెస్టులోనే అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా యశస్వి రికార్డు సృష్టించాడు. ఇంతకుముందు సునీల్ గావస్కర్ పేరిట (113 )ఉండేది. బ్యాటింగ్‌కు దిగిన పంత్, ధ్రువ్ జురెల్ ఎక్కువసేపు నిలవలేదు. తొలుత లైయన్ బౌలింగ్‌లో భారీ షాట్‌కు యత్నించిన పంత్.. బంతి మిస్ కావడంతో స్టంపౌట్ అయ్యాడు. ఇక ధ్రువ్ జురెల్ దురదృష్టంకొద్దీ పెవిలియన్‌కు చేరాడు.




తెలంగాణ
శాసనసభ
తెలుగు దినపత్రిక
జిల్లా అనుబంధం
|| సోమవారం 25 నవంబర్ - 2024 || పేజీలు : 4

# ఇందిరా మహిళా శక్తి సంబరాలను విజయవంతం చేయండి

## - నాంపల్లి మండల సమైక్య అధ్యక్షురాలు గాలెంక ఇందిర.



**నాంపల్లి, శాసనసభ న్యూస్ నవంబర్ 24 :** ఇందిర మహిళా శక్తి కింద పాడి పశువులు, పెరటి కోళ్ల పెంపకం, ప్రోత్సహిస్తూ రుణాలు అందిస్తున్నారని నాంపల్లి మండల సమైక్య అధ్యక్షురాలు జి. ఇందిర అన్నారు. నాంపల్లి మండల కేంద్రంలో అంబేద్కర్ వివో ప్రత్యేక సమావేశం నిర్వహించడం జరిగింది. కొత్తగా మహిళా సంఘ సభ్యులను బొట్టుపెట్టి సంఘంలోకి ఆహ్వానించడం జరిగింది. అనంతరం ఆమె మాట్లాడుతూ వడ్డీ లేని రుణాలు, యూనిఫాముల తయారీ, బ్యాంకు లింకేజీ కార్యక్రమం, ఎంటర్ప్రైజెస్ ఏర్పాటు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు, కొత్త సంఘ సభ్యులకు శిక్షణ,పొదుపు, రుణాలు, వాటి లాభాలను వివరించి చైతన్యం చేస్తానన్నారు. సంఘంలో చేరిన మహిళలకు ప్రభుత్వం ప్రమాద బీమా 10 లక్షల రూపాయలు, అంగవైకల్యం 5 లక్షల రూపాయలు, సహజ మరణం 2 లక్షల రూపాయలు, రుణబీమా రుణాలు తీసుకున్న మహిళా సంఘ సభ్యురాలు మరణిస్తే లోన్ మొత్తం మాఫీ అవుతుంది ఆమె అన్నారు. వ్యవసాయానికి 100 శాతం రుణమాఫీ పథకాలు ఉన్నాయన్నారు. నాలుగు ఎకరాలు ఉన్న మహిళా సంఘ సభ్యుకు సోలార్ ప్లాంట్ ప్రభుత్వ ఏర్పాటు చేస్తుంది అన్నారు. ఈ కార్యక్రమంలో విబికె సంతోష సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి నోటీసులు..

**హైదరాబాద్ / శాసనసభ న్యూస్ ప్రతినిధి :** ఐబీఆర్ఎస్ హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి పోలీసులు నోటీసులు జారీ చేశారు. దళితుల బంధు రెండో విడత డబ్బులు విడుదల చేయాలని కౌశిక్ రెడ్డి ఈ నెల 9న హుజూరాబాద్ లో ధర్నా, నిరసన చేపట్టిన విషయం తెలిసిందే. అయితే కౌశిక్ రెడ్డి ధర్నాకు, నిరసనకు ఎలాంటి అనుమతి తీసుకోకపోవడం వివాదాస్పదమైంది. అనుమతి లేకుండా ధర్నా, నిరసనలు చేపట్టినందుకు గాను ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, బీఆర్ఎస్ నేతలపై బీఎన్ఎస్ చట్టంలోని సెక్షన్ 35(3) కింద పోలీసులు కేసు నమోదు చేసి నోటీసులు జారీ చేశారు. ప్రభుత్వంపై విమర్శలు గుప్పించడంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ముందుంటున్నారు. బొగ్గు



బూడిద రవాణాలో జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్ అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి పాలనా విధానాలను కూడా అసెంబ్లీ లోపల, బయట, మీడియా సమావేశాల్లో విపక్షాలు తరచూ విమర్శిస్తున్నాయి. ఎమ్మెల్యే ఫిరాయింపు వివాదంలో కౌశిక్ రెడ్డి స్వయంగా అరికపూడి గాంధీకి సవాళ్ల వివాదం సాగింది. కోర్టులో పిటిషన్ కూడా వేశారు.

## కంఠ మహేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ లో పాల్గొన్న

# మర్రి నిరంజన్ రెడ్డి



**ఇబ్రహీంపట్నం, శాసనసభ న్యూస్ ప్రతినిధి నవంబర్ 24 :** ఇబ్రహీంపట్నం మండలం పోచారం గ్రామంలో కంఠమహేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ట సురమాంబ దేవి, వన ఎల్లమ్మ, వన మైసమ్మ దేవతల విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొని, ప్రత్యేక పూజలు నిర్వహించిన తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సభ్యులు, ఆదిభట్ల మున్సిపాలిటీ చైర్మన్ మర్రి నిరంజన్ రెడ్డి. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మర్రి నిరంజన్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మర్రి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ గౌడన్నల కుల దైవం శ్రీ కంఠమహేశ్వర స్వామి (కాటమయ్య) చల్లని దీవెనలతో ప్రజలందరూ పాడిపంటలతో, సుఖ సంతోషాలతో, అష్ట ఐశ్వర్యాలతో, సుభిక్షంగా ఉండాలని వేడుకున్నారు. ఈ సందర్భంగా మర్రి నిరంజన్ రెడ్డిని ఆశీర్వదించిన వేద పండితులు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు చింతాకుల శివ గౌడ్, పెంటయ్య, ప్రభాకర్, కిషోర్ భాను, సాయి, మరియు గౌడ సంఘం సభ్యులు,



గ్రామ పెద్దలు, బంధుమిత్రులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# డేటా ఎంట్రీ కీలకమైనది : భట్టి విక్రమార్క

**హైదరాబాద్ / శాసనసభ న్యూస్ ప్రతినిధి :** సమగ్ర కుటుంబ సర్వే చివరి దశకు చేరుకుంటుందని, డేటా ఎంట్రీ దశ చాలా ముఖ్యమైనదని, ఎలాంటి పొరపాట్లకు అవకాశం ఇవ్వకండని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ఆదివారం ఉదయం ఆయన జారండ్ రాజధాని రాంచి నుంచి సమగ్ర కుటుంబ సర్వే వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొని ఉన్నతాధికారులకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వం ఈ అంశంపై దృష్టి కేంద్రీకరించిందని తెలిపారు.



# ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ లో సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులకే అవకాశం కల్పించాలి

## - కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మాధగోని జంగయ్య గౌడ్.



**మంచాల, శాసనసభ న్యూస్ ప్రతినిధి నవంబర్ 24 :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయబోయే నామినేటెడ్ పదవులలో కాంగ్రెస్ పార్టీలో మొదటి నుండి పనిచేస్తూ అధికారం ఉన్న లేకపోయినా ఇతర పార్టీ లలోకి వలస వెళ్ళకుండా కాంగ్రెస్ పార్టీ కోసం పని చేస్తున్ననాయకులకే తగినప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఇప్పటికే ఇందిరమ్మ కమిటీలో సీనియర్ నాయకులకు పలుగ్రామాల్లో అన్యాయం జరిగింది అనిఅన్నారు. కొంతమంది నాయకులు రహస్యంగా మీటింగ్ లు పెట్టుకొని వాళ్ళు చెప్పినట్టు వినే నాయకుల పెర్లనే గుట్టు చప్పుడు కాకుండా గ్రామాల్లో నాయకులకు కార్యకర్తలకు చెప్పకుండా పైరవీలు చేస్తూ కమిటీలలో పేర్లు పైనల్ చేసి సీనియర్ నాయకులకు ఆందోళనకలిగిస్తు న్నారన్నారు. ఇప్పటికైనా పార్టీ అధిష్టానం స్థానిక ఎమ్మెల్యే రంగారెడ్డి గుర్తించి మొదటి నుండి కాంగ్రెస్ పార్టీలో ఉ ంటూ పార్టీకోసం పనిచేస్తున్న సీనియర్ నాయకులను గుర్తించి నామినేటెడ్ పదవులు సీనియర్ నాయకులకు తగిన ప్రాధాన్యత ఇచ్చి వారికి న్యాయం చేయాలి. అలాగే ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో పెద్ద గ్రామ పంచాయతీ అయినా ఆరుట్ల గ్రామానికి మార్కెట్ కమిటీలో సీనియర్ నాయకులకు అవకాశం ఇవ్వాలని ఈ సందర్భంగా పార్టీ అధిష్టానాన్ని ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి గారిని కోరుచున్నాంకొంతమందినాయకులు మంచాల మండలంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులకు ఎలాంటి నామినేటెడ్ పదవులు రాకుండా రహస్యంగా మీటింగులు పెట్టుకుంటూ పైరవీలు చేస్తున్నారు అలాంటి నాయకుల మాటలు వినకుండా సీనియర్ కాంగ్రెస్ నాయకులకు నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించి న్యాయం చేయాలని మాధగోని జంగయ్య గౌడ్ కోరారు.

# అయ్యప్ప స్వామి ఆశీర్వాదం ప్రతిఒక్కరిపై ఉండాలి

## - ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత.
## - జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు.





**జహీరాబాద్, శాసనసభ న్యూస్ ప్రతినిధి నవంబర్ 24 :** అయ్యప్ప స్వామి ఆశీస్సులతో జహీరాబాద్ నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాల తో ఉండాలని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనేంటి మాణిక్ రావు అన్నారు. ఆదివారం రోజు పడిపూజ కార్యక్రమం పస్తాపూర్ గ్రామంలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో నిర్వహించి న సందర్భంగా ఎమ్మెల్యే హాజరై స్వామివారి ఆశీస్సులు అందుకున్నారు. అయ్యప్ప స్వామి ఆలయంలో భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ విజ్ఞప్తి మేరకు 15 లక్షల రూపాయల నిధులను మంజూరు చేసిన రాష్ట్ర మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావుకు ఎమ్మెల్యే మాణిక్ రావుకు ఆలయ కమిటీ బృందం కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాణిక్ రావును స్థానిక ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. పూజా కార్యక్రమంలో జహీరాబాద్ మండల పార్టీ అధ్యక్షులు తట్టు నారాయణ, సీనియర్ నాయకులు నామారవి కిరణ్, అయ్యప్ప స్వామి భక్తులు, పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# ఐక్యమత్యానికి స్నేహాభావానికి క్రీడలు దోహదం చేస్తాయి

## - ఆరుట్లలో ఘనంగా ప్రారంభమైన ఐపిఎల్ క్రీడోత్సవాలు.
## ఇబ్రహీంపట్నం ఏసిపి కెపీవి రాజు





**ఇబ్రహీంపట్నం / శాసనసభ న్యూస్ ప్రతినిధి నవంబర్ 24 :** క్రీడలు దేహదారుడ్యానికి మానసిక ఉల్లాసం కల్గించడమే కాకుండా యువకుల మధ్య ఐక్యమత్యానికి స్నేహాభావానికి దోహదం చేస్తాయని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు అన్నారు. ఆదివారం మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో జరిగిన ఐపిఎల్ క్రికెట్ పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అయన ఆరుట్ల గ్రామ మాజీ సర్పంచ్ కొంగర విష్ణువర్ధన్ రెడ్డి మాజీ ఎంపీటీసీలు కావలి శ్రీనివాస్ చీరాల రమేష్ మంచాల సీఐ మధు లతో కలిసి క్రీడోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు చెడు వ్యాసనాల బారిన పడకుండా సన్మార్గంలో వెళ్లి గ్రామానికి మంచిపేరు తీసుకురావాలని అన్నారు. గంజాయి లాంటి మత్తు పదార్థాలను అరికట్టడానికి యువకులు నడుం బిగించి తమతో సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు గుడ్డిమల్ల చంద్రయ్య మార సురేష్ అంతటి రాజు గౌడ్, మార బుగ్గరాములు, ఆర్ల శ్రీనివాస్, కంబాలపల్లి భాస్కర్, బుట్టి కృష్ణ, వస్పరి కుమార్, వెదిరే సికిందర్ రెడ్డి, రావుల రాఘవ, దుబ్బాక సూర్యం, కొండిగారి శ్రవణ్, చీమర్ల మహేష్, వివిధ జట్ల స్పాన్సర్లు ఐపిఎల్ ఆర్గనైజర్లు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# వివాహ వేడుకల్లో మాజీ సర్పంచ్ కాయితి జితేందర్ రెడ్డి



**చింతపల్లి, శాసనసభ న్యూస్ ప్రతినిధి నవంబర్ 24 :** చింతపల్లి మండలం,తీదేడు(వెంకటంపేట)గ్రామానికి చెందిన ఐతమోని మల్లయ్య భాగ్యమ్మ కూతురు మహేశ్వరి వివాహ వేడుకలలో పాల్గొన్న తీదేడు మాజీ సర్పంచ్ లు కాయితి జితేందర్ రెడ్డి, దాసరి శ్రీనివాస్ యాదవ్, మోహన్. నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో తీదేడు మాజీ సర్పంచ్ లు కాయితి జితేందర్ రెడ్డి,దాసరి శ్రీనివాస్ యాదవ్,మోహన్, సోనాగంటి కృష్ణామా చారి,గునమోని శ్రీనివాస్ ముది రాజ్, రెడ్డి అంజయ్య,రెడ్డి వెంకటయ్య,నున్నగోపుల శివ, తదితరులు పాల్గొని వధూ వరులను ఆశీర్వదించారు.

# మాదిగల ఆత్మీయ సభను జయప్రదం చేయండి

## బోసు పల్లి ప్రతాప్ బండి మీద కృష్ణ



**యాచారం శాసనసభ న్యూస్ ( నవంబర్ 24) :** ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో మాదిగ జేఏసీ ఆధ్వర్యంలో ముఖ్య నాయకుల సమావేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదివారం ఈ సందర్భంగా.. బోసు పల్లి ప్రతాప్,బండి మీద కృష్ణ మాట్లాడుతూ... ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఏబిసిడి వర్గీకరణకై మాదిగలంతా చైతన్యమై ఇబ్రహీంపట్నం నియోజకవర్గం లో డిసెంబర్ మాసంలో జేఏసీ ఆధ్వర్యంలో ముఖ్య నాయకుల సమావేశం ఏర్పాటు చేయునట్లు వెల్లడించారు. ఈ సమావేశానికి మాదిగ ఉద్యోగస్తులు, నిరుద్యోగులు, మాదిగ కులస్తులు,ప్రతి ఒక్కరూ హాజరుకావాలని పిలుపునిచ్చారు. గత 30 సంవత్సరాల నుండి మందకృష్ణ మాదిగ ఏబిసిడి వర్గీకరణ కోసం అనేక పోరాటాలు నిర్వహించారు. ఏబిసిడి వర్గీకరణ కోసం మాలలు అడ్డుపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ ఈ సమావేశంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

# శ్రీ శ్రీ శ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామి సన్నిధిలో లిమ్స్ హాస్పిటల్ ఉచిత వైద్య సేవలు

- లిమ్స్ హాస్పిటల్ సేవలు అభినందనీయం
- ఇబ్రహీంపట్నం మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోడూరి రమేష్






**మంచాల, శాసనసభ న్యూస్ ప్రతినిధి నవంబర్ 24 :** మంచాల మండల ఆరుట్ల గ్రామంలో కొలువైఉన్న శ్రీ శ్రీ బుగ్గలింగేశ్వర స్వామిని దర్శించుకున్న ఇబ్రయింపట్నం మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోడూరి రమేష్ ప్రవళిక దంపతులు. ఈ సందర్భంగా అక్కడే గతపది రోజులుగా సుమారుగా రోజుకు రెండు వందల మందికి ఉచిత వైద్య సేవలు అందిస్తున్న లిమ్స్ హాస్పిటల్ బృందాన్ని అభినందిచిన కోడూరి రమేష్. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ బుగ్గరామలింగేశ్వర స్వామిని దర్శించుకోవడానికి వస్తున్న భక్తులకు ఉచిత సేవలు చేయడం చాలా సంతోషకర మైన విషయం అని ఇంకా లిమ్స్ హాస్పిటల్ బృందం పేదలకు తక్కువ బిల్లులతో సేవలు చేయాలని ఇంకా గ్రామాల్లో కూడా ఉచిత వైద్య సేవలు చేయాలని ఈ సందర్భంగా లిమ్స్ హాస్పిటల్ బృందాన్ని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీర్ల వెంకటేష్, శంకర్, లిమ్స్ హాస్పిటల్ బృందం పోల్గొనడం జరిగింది.

# అందుల జాతీయ జూనియర్ చెస్ ఛాంపియన్‌లో మొదటి బహుమతి పొందిన వి.ఆకాష్

## - ప్రతిభలో అందత్వాన్ని జయించిన ఘనుడు ఆకాష్.

**ఇబ్రహీంపట్నం,శాసనసభ న్యూస్ ప్రతినిధి నవంబర్ 24 :** ఇబ్రహీంపట్నం మున్సిపల్ కేంద్రానికి చెందిన నాగరాజు కుమారుడు వడ్లకొండ.ఆకాష్ జాతీయ అందుల చెస్ ఛాంపియన్ పోటీల్లో మొదటి బహుమతి పొంది ఇబ్రహీంపట్నం, ఇంకా మన తెలంగాణ రాష్ట్ర కీర్తిని ఇనుమడింప చేశాడు ఆకాష్. ఎఐసిఎఫ్బి నేషనల్ జూనియర్ ఛాంపియన్షిప్ 2024 కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూరులో నిర్వహించగా మొదటి బహుమతి పొంది జాతీయస్థాయిలో రికార్డు సృష్టించాడు .తండ్రి వడ్లకొండ నాగరాజు చిన్నపాటి ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ తన కొడుకును అందత్వం అడ్డు ఏది కాదని నిరూపించే విధంగా పెంచడం, అన్ని రకాల ఆటపాటల్లో నేర్పించడం జరిగింది.తాను ఈ స్థాయికి రావడానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన బ్లైండ్ చెస్ కోచ్ సహాయ సహకారాలు నాకు ఎంతగానో ఉపయోగపడ్డాయని చెస్ ఛాంపియన్ ఆకాష్ అన్నారు. తనకు ఆర్థికంగా ప్రభుత్వం సహకరిస్తే భవిష్యత్తులో జాతీయ అంతర్జాతీయ స్థాయిలో చెస్ ఆడి మరిన్ని విజయాలు తేవడానికి ప్రయత్నిస్తానని అన్నాడు.



# టి ఎస్ యుటిఎఫ్ మంచాల మండల నూతన కమిటీ ఎన్నిక

**మంచాల, శాసనసభ న్యూస్ ప్రతినిధి నవంబర్ 24 :** టీఎస్ యుటిఎఫ్ మంచాల నూతన కమిటీని రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు గోపాల్ నాయక్ అధ్యర్వములో ఎన్నుకోవడం జరిగింది. మంచాల మండల టీఎస్ యుటిఎఫ్ ఉపాద్యాయ సంఘం అధ్యక్షునిగా ఎమ్.డి. అజ్మత్ ఖాన్,మండలప్రధానకార్యదర్శి గా తుల్జారాం,ఉపాధ్యక్షునిగా,యాదయ్య,శ్యామల, కోశాధికారిగా ప్రభు,ఆడిట్ కమిటీ కన్వీనర్ మోహన్ గౌడ్,మహాసభ ప్రతినిధులుగా మోతిలాల్, వెంకట్ నర్సయ్య,విశారద, కార్యదర్శులుగా,ఎం. డి. మజరుల్లా ఖాన్, ఐలయ్య, విమల, రమ, సుధాకర్, చంద్రశేఖర్ తదితరులను ఎన్నుకోవడం జరిగింది.టీఎస్ యు టి ఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోపాల్ నాయక్ మాట్లాడుతు టీఎస్ యుటిఎఫ్ ఉపాద్యాయ సంఘం విద్యారంగ సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం చేస్తుందని, ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత కరెంటు కోసం ప్రభుత్వానికి ప్రాతినిధ్యం చేసి సాధించిందని, పాఠశాలల్లో సర్వీసు



పర్సన్స్ నియమించడానికి ప్రభుత్వము తో రాజీ లేని పోరాటం చేసిందని అన్నారు . కేజీబీవీ ఉపాద్యాయుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని, నూతన పెన్షన్ విధానం రద్దు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశములో జిల్లా కోశాధికారి డాక్టర్ జగన్నాథ్, రాష్ట్రకమిటి సభ్యులు శ్రీమతి సుగంధ, తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# దొంగతనం జరిగిన ఇంటిని పరిశీలించిన : డి.ఎస్పి.

**చండూర్ నవంబర్ 24 (శాసనసభ న్యూస్) :** చండూర్ మున్సిపాలిటీ లోని శుక్రవారం రోజున ఎవరో గుర్తు తెలియని దొంగలు చండూర్ ఆంజనేయస్వామి గుడి దగ్గరలో ఉన్న మొగుదాల కవిత భర్త లేట్ ఆంజనేయులు ఇంట్లోకి వెనుక నుండి ప్రవేశించి ఇంట్లో బీరువలో దాచిన లాంగ్ చైన్,చంద్రహారం,నక్లెస్, చైన్, రింగ్ లు, చెవి కమ్మలు, బిస్కెట్ బంగారం మొత్తం కలిపి అందజా (25 తులాలా బంగారం), 50 తులాల వెండి, 70 వేల రూపాయలు నగదు ను దొంగలించినారు అని మొగుదల కవిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎన్.వెంకన్న తెలిపారు. విషయం తెలుసుకున్న డిఎస్పి ఆదివారం రోజున మొగుదల కవిత ఇంటిని పరిశీలించి చోరీ కి పాలు పడిన దుండగులు ఎవరైనా సరే పట్టుకుంటామని అన్నారు.

# రైతులను 5 గంటల పాటు విచారించిన మానవ హక్కుల కమిషన్



**హైదరాబాద్ / శాసనసభ ప్రతినిధి :** ఇటీవల వికారాబాద్ జిల్లా లగచర్ల గ్రామంలో భూసేకరణ సభ హింసాత్మకంగా మారడం తెలిసిందే. రైతులు, గ్రామస్తులు జిల్లా కలెక్టర్ పై దాడి చేశారు. దాంతో రైతులపై పోలీసు కేసులు నమోదు కాగా, అరెస్టయిన రైతులు ప్రస్తుతం సంగారెడ్డి జైలులో ఉన్నారు.కాగా, ఈ వివాదాన్ని జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్ హెచ్ఆర్ సీ) సుమోటోగా తీసుకుంది. ఈ క్రమంలో, నేడు సంగారెడ్డి జైలులో లగచర్ల రైతులను కలిసిన ఎన్ హెచ్ఆర్ సీ ప్రతినిధులు విచారణ జరిపారు. ఈ విచారణ కొద్ది సేపటి కిందట ముగిసింది. ఎన్ హెచ్ఆర్ సీ డిప్యూటీ రిజిస్ట్రార్ మ-ఖేశ్ నేతృత్వంలో ముగ్గురు సభ్యులు, వికారాబాద్ జిల్లా అధికారులు ఈ మధ్యాహ్నం ప్రారంభమైన విచారణ దాదాపు 5 గంటల పాటు సాగింది. లగచర్ల కేసులో పూర్తి విచారణ చేపట్టాలని ఎన్ హెచ్ఆర్ సీ నిర్ణయించింది. ఈ విచారణ ఈ నెల 26 వరకు కొనసాగనుంది.

# మునుగోడు లో ప్రజా పాలన

## ప్రజా విజయోత్సవ సంబరాలు





**చందూర్ నవంబర్ 24 (శాసనసభ న్యూస్):** మునుగోడు మండలం లో చౌరస్తా లోని అంబేద్కర్ విగ్రహం వద్ద మండల అధ్యక్షుడు బీమనపల్లి సైదులు ఆద్వర్యంలో ప్రజా పాలన ప్రజా విజయోత్సవ సంబరాలు నిర్వహించడం జరిగింది. ప్రజా పాలన ప్రజా విజయోత్సవ సంబరాలు మునుగోడు, కోరటికల్, పలివెల గ్రామాలలో నిర్వహించారు. మండల అధ్యక్షుడు బీమనపల్లి సైదులు మాట్లడుతూ ఆయా గ్రామాలలో దండోరా వేయించి ప్రజా పాలన ప్రజా విజయోత్సవ సంబరాలు నిర్వహించాలని కాంగ్రెస్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ నరేందర్, ఇన్చార్జి ఎంపీడీవో విజయభాస్కర్, సెక్రటరీ మానస, ఆనగంటి కృష్ణ, మందుల బీరప్ప, గ్రామ శాఖ అధ్యక్షుడు దండు లింగుస్వామి, తదితరులు పాల్గొన్నారు.

# మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

## - యాంజాల్ మాసబ్ చెరువు,ఇబ్రహీంపట్నం చెరువులో ఉచిత చేప పిల్లల విడుదల.

### - ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి.




**తుర్కయంజాల్, శాసనసభ న్యూస్ నవంబర్ 24 :** ఇబ్రహీంపట్నం నియోజకవర్గం లోని తుర్క యంజాల్ మాసబ్ చెరువు, ఇబ్రహీంపట్నం పెద్ద చెరువులో ఆదివారం నాడు ఉచిత చేప పిల్లలను విడుదల చేసిన ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి. ఈ కార్యక్రమంలో ఫిషరీష్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్, జిల్లా మత్సశాఖ అధికారి పూర్ణిమ, మున్సిపల్ చైర్మన్ కప్పరి స్రవంతి,వైస్ చైర్మన్ లు గుండ్ల పల్లి హరిత, బర్ల మంగ,స్థానిక మత్సకారుల సంఘం నాయకులు, కౌన్సిలర్లు, నాయకులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా, మండల, మున్సిపల్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నిలోఫర్‌లో పసికందు కిడ్నాప్ కేసు సుఖాంతం..



**హైదరాబాద్,శాసనసభ ప్రతినిధి :** నిలోఫర్ ఆసుపత్రిలో పసికందు కిడ్నాప్ అయిన ఘటన కలకలం రేపిన విషయం తెలిసిందే. ఈ కేసును ఛాలెంజ్ గా తీసుకున్న పోలీసులు ఆరు గంటల్లోనే చిన్నారి ఆచూకీ కనుగొన్నారు.జహీరాబాద్ కు చెందిన హసీనా బేగం దంపతులకు చెందిన నెల రోజుల బాబుకు జాండీస్ రావడంతో హైదరాబాద్ లోని నిలోఫర్ ఆసుపత్రిలో చేర్పించారు. శనివారం రాత్రి హసీనా బేగం బాబును ఎత్తుకొని ఉండగా.. ఆసుపత్రి సిబ్బందిని అని తల్లిని నమ్మించిన ఓ మహిళ బాబుని ఎత్తుకొని అక్కడి నుంచి జారుకుంది.ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. బాబుని హైదరాబాద్ నుండి కర్నూల్ వైపు తరలించారని గుర్తించి, జోగులాంబ గద్వాల జిల్లా పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఉ ండవెల్లి, అలంపూర్, మానవపాడు చెందిన ఎస్సైలు, పోలీస్ సిబ్బంది ఉండవెల్లి మండల పరిధిలోని పుల్లూరు టోల్గేట్ సమీపంలో వాహనాల తనిఖీ ముమ్మరం చేశారు. ఆదివారం తెల్లవారుజామున 3:30 గంటల సమయంలో ఓమ్ని వ్యాన్‌లో ముగ్గురు చిన్నారులతో ఆరుగురు కలిసి తీసుకెళ్తున్నట్లు గుర్తించారు. అందులో ఓ మగ పిల్లవాడు, ఇద్దరు ఆడబిడ్డలు సురక్షితంగా ఉ న్నారని పోలీస్ శాఖ అధికారులకు సమాచారం అందించి, ఆరుగురు కిడ్నాపర్లను అదుపులకు తీసుకొని నాంపల్లి స్టేషన్ కు అప్పగించారు. అనంతరం నాంపల్లి పోలీసులు పసికందును సురక్షతంగా తల్లి హసీనా బేగం వద్దకు చేర్చారు. జోగులాంబ పోలీసులు చాకచక్యంగా పట్టుకుని 6 గంటల వ్యవధిలోనే ముఠాను పట్టుకోవడంతో కేసును ఛేదించిన పోలీసు సిబ్బందిని అధికారులు అభినందించారు.

# నల్ల పోచమ్మ అమ్మవారిని దర్శించుకున్న

## తట్టు నారాయణ



**జహీరాబాద్, శాసనసభ న్యూస్ ప్రతినిధి నవంబర్ 24 :** బోరంచ నల్ల పోచమ్మ అమ్మవారిని జహీరాబాద్ మండల బిఆర్ఎస్ అధ్యక్షులు తట్టు నారాయణ ఆదివారం దర్శించుకున్నారు. దర్శించుకున్న వారిలో ఆయనతో పాటు జహీరాబాద్ మండల బీసీ సెల్ అధ్యక్షులు అమిత్ కుమార్, పట్టణ బీసీ సెల్ అధ్యక్షులు రాజా రమేష్, తాజా మాజీ సర్పంచులు చిన్నారెడ్డి, కరుణ్ రాజ్, దిడికి మాజీ ఉపసర్పంచ్ రాజు, ఫీల్డ్ అసిస్టెంట్ నవీన్,ఈశ్వర్,రవి, సతీష్, సాయి పాల్గొనడం జరిగింది. అనంతరం దిడిగి గ్రామ యువ నాయకులు సుమన్ ముదిరాజ్ ఏర్పాటు చేసిన విందులో పాల్గొన్నారు.

# ఆదిభట్ల పరిధిలో వ్యాపారి రాచ నారాయణను

## బెదిరించిన గుర్తు తెలియని దుండగులు

- మహిళల గొంతుతో, ప్లాట్లు అమ్మడానికి ఉన్నాయని చెప్పి మోసం
- నకిలీ పోలీసులుగా చలామని అవుతున్న వారిని తప్పకుండా శిక్షిస్తాం.
- ఆదిభట్ల సీఐ రాఘవేందర్ రెడ్డి




**ఆదిభట్ల, శాసనసభ న్యూస్ ప్రతినిధి నవంబర్ 24 :** హలో సార్ మీరు రియల్ ఎస్టేట్ వ్యాపారులా అయితే మా దగ్గర ప్లాట్లు ఉన్నాయి. కొనుగోలు చేస్తారా అని మహిళల వాయిస్ తో మాట్లాడి కొత్త కొత్త మోసాలకు పాల్పడుతున్నారు కొందరు గుర్తుతెలియని దుండగులు. ఆదిభట్ల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రంగారెడ్డి జిల్లా, ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో గత పదిరోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తులు వ్యాపారి రాచ నారాయణ అనే వ్యక్తికి ఫోన్ చేసి కారు ఇన్సూరెన్స్ సంబంధించిన వాళ్ళంఅంటూ మహిళా గొంతుతో మాట్లాడుతూ మీరు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు కదా మాకు బొంగులూరు హైవే పక్కన ప్లాట్లు అమ్మకానికి ఉన్నాయని, బొంగులూరు పరిధిలోని మెగా టౌన్షిప్ వెంచర్ కు రమ్మని చెప్పారు. సదరు వ్యాపారి మెగా టౌన్షిప్ వెంచర్ వద్దకు ప్లాట్లు చూద్దామని చేరుకోగానే వ్యాపారి రాచ నారాయణ అతని డ్రైవర్ ఎం.డి ముసిబ్ పాష పై నలుగురు వ్యక్తులు దాడి చేసి, ముఖానికి ముసుగులు వేసి అక్కడి నుంచి తరలించి జనసంచారం లేని ప్రదేశానికి తీసుకువెళ్లి ఒక గదిలో బంధించారు. వ్యాపారి తలపై పోలీసు యూనిఫామ్ ధరించిన ఒక వ్యక్తి కోటి రూపాయలు ఇవ్వాలని బెదిరించడం జరిగింది. నా దగ్గర అంత డబ్బు లేదని వ్యాపారి చెప్పగా పోలీస్ యూనిఫామ్ లో ఉన్న వ్యక్తి రాచ నారాయణ తలపై తుపాకీ పెట్టి బెదిరించి పేపర్లపై వేలిముద్రలు, సంతకాలు తీసుకున్నాడు. అనంతరం కొంగరకలాన్ ప్రాంతంలో బాధితుని వదిలి వెళ్ళగా తాను ఎక్కడ ఉ న్నానని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. కొంగరకలాన్ లో ఉన్నానని తెలుసుకున్న వ్యాపారి వెంటనే తన కుటుంబ సభ్యు లకు ఫోన్ చేసి జరిగిన విషయం చెప్పడంతో ఆలస్యం చేయకుండా చందూర్ కు రమ్మని కుటుంబ సభ్యులు చెప్పడంతో డ్రైవర్ మ-ుజీబ్ భాష తో కలిసి రాచ నారాయణ తన కారులో వెళ్లిపోయాడు. ఘటన జరిగిన పది రోజుల తర్వాత శనివారం ఆదిభట్ల పోలీస్ స్టేషన్ లో బాధితుడు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆదిభట్ల ఇన్స్పెక్టర్ రాఘవేందర్ రెడ్డి తెలిపారు.